ong-9_ong-9.qxd 4/11/2026 12:57 AM Page 1



## గారా సత్యనారాయణకు డాక్టరేట్

### - సోషల్ సర్వీసెస్ కోటాలో ఏసియన్ యూనివర్శిటీ అందజేత

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



నగరానికి చెందిన వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగి గారా సత్యనారాయణ సోషల్ సర్వీస్,రూరల్ ప్రాంతాల్లో గారా చారిటబుల్ ట్రస్టు ద్వారా చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తుగా ఏసియన్ యూనివర్శిటీ సంస్థ గోవాలో సోషల్ సర్వీసెస్ డాక్టరేట్‌ను అందించింది. గోవాలోని ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం రావత్ కామత్ చేతుల మీదుగా ఈ డాక్టరేట్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 32 యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు. అయితే సత్యనారాయణ నగరంలోనే అంబేద్కర్ భవన్ ద్వారా పేద విద్యార్థుల చదువుకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆరోగ్యశాఖలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విశేష సేవలందించారు. తన ట్రస్టు ద్వారా పేద ప్రజలకు నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఆయన సేవలను గుర్తించిన ఈ సంస్థ సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించడంతో వారి కుటుంబ సభ్యులు, అభిమానులు, వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగులు పలువురు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ఈ ఏడాది ఖరీఫ్‌లో వేయనున్న పంటలపై శాస్త్రవేత్తలు,రైతులు చర్చాగోష్ఠి

**పద్మనాభం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**





మండల కాంప్లెక్స్ లో ఉన్న వెలుగు కార్యాలయంలో శుక్రవారం భీమిలి డివిజన్ స్థాయిలో ఎలినినో కారణంగా రానున్న ఖరీఫ్‌లో వేయనున్న పలు రాకాల పంటల సాగుపై శాస్త్రవేత్తలు, రైతులు చర్చాగోష్ఠి కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త ఎన్ రాజుకుమార్,సౌజన్య, ఎడిఎ విజయప్రసాదు, మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న ఎనిలినో ప్రభావంతో ఏర్పడనున్న వర్షాబావ పరిస్తితులలో దీర్ఘకాలిక పంటలు కాకుండా స్వల్పకాలిక పంటలను సాగుచేసుకోవాలని వారు రైతులకు సూచించారు. తక్కువ నీటితో పండే కొర్రలు, గంటిలు, సజ్జలు తదితర పంటలను వెయ్యాలని కోరారు. అలాగే ఈ నెలలో వెయ్యనున్న నువ్వుల పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ ఒ లు సింహాచలం, శివకోమలి, సంధ్యారత్నప్రభ, శశికల, రైతులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా అండిబోయిన లక్ష్మీ

**గాజువాక,ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



గాజువాక బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా అండిబోయిన లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. గత 14 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న లక్ష్మి, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తూ గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తోటి న్యాయవాదులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మహిళా న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. లక్ష్మి ఎన్నిక పట్ల పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ఘనంగా అభినందించారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం

**గాజువాక,ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



పెన్షనర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని పారిశ్రామిక ప్రాంత ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మల్కాపురంలో సిపిఎం కార్యాలయంలో సిహెచ్. అమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కె. నూకరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. హుస్సేన్ మాట్లాడారు. మే 10 లేదా 17 తేదీల్లో గాజువాకలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్, వైద్య సదుపాయం, హయ్యర్ పెన్షన్ అంశాలపై యాజమాన్యానికి వినతిపత్రం అందజేశామని, అవసరమైతే కోర్టును ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన

**గాజువాక, ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



ఆర్టీసీ సిబ్బంది తమ ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు సూచించారు. గాజువాక డిపో వద్ద శుక్రవారం డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందికి నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య బృందాలు సిబ్బందికి పలు ఆరోగ్య సూత్రాలపై శిక్షణ ఇచ్చాయి. విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలితే అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా అందించాలో సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం 108 సాయంతో బాధితులను ఆసుపత్రికి తరలించే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, వైద్యులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయి జీతాల కోసం క్లాప్ ఆటో కార్మికుల ధర్నా

**గాజువాక, ఏప్రిల్ 10,ప్రభాతవార్త**



మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద క్లాప్ ఆటో కార్మికులు శుక్రవారం మెరుపు నిరసన చేపట్టారు. ఉదయాన్నే విధులను బహిష్కరించడంతో చెత్త తరలింపు వాహనాలు నిలిచిపోయాయి. కార్మికులకు మద్దతుగా సిఐటియు నేతలు గొలగాని అప్పారావు, పి.మణి పాల్గొని మాట్లాడారు. ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్ స్పందిస్తూ.. వారం రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు. అనంతరం పి.మణి మాట్లాడుతూ.. కాలుష్య నివారణ కోసం 12న వైజంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

## సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న సినీ నటులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**



నగరంలోని ఆశీలమెట్ట జంక్షన్ సమీపంలో ఉన్న సంపత్ వినాయగర్ ను శుక్రవారం రాత్రి డెకైట్ హీరో అడవి శేషు, మృనాల్ ఠాకూర్ తదితరులు దర్శించుకున్నారు.

# గ్యాస్ బండ్ల దందా మంటలు..!




- *బుకింగ్‌లకు బ్రేక్.. బ్లాక్‌కు గ్రీన్ సిగ్నల్?*
- *మధురవాడలో బ్లాక్ మార్కెట్ విర్రవీగింపు*
- *బుక్ చేసిన వారికి 15 రోజుల నిరీక్షణ*
- *దళారుల వద్ద పదుల సంఖ్యలో సిలిండర్ల నిల్వ*
- *హోటల్స్, దుకాణాలకు అధిక ధరలకు విక్రయం*
- *బ్యాక్‌లాగ్ అంటున్న గ్యాస్ ఏజెన్సీలు..*
- *ఫీల్డ్‌లో భిన్న పరిస్థితులు*
- *పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ దృష్టి సారించాలని ప్రజల డిమాండ్*

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త):**

అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం దేశంలో ఇంధన సరఫరాపై పడుతుండగా, అదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని గ్యాస్ బండ్ల బ్లాక్ మార్కెట్ దందా విస్తరిస్తోంది. ఒకవైపు సామాన్య ప్రజలు గ్యాస్ కోసం రోజుల తరబడి వేచి చూస్తుంటే, మరోవైపు దళారులు మాత్రం భారీగా సిలిండర్లు నిల్వ చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.విశాఖపట్నం నగర పరిధిలోని మధురవాడ ప్రాంతంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని వినియోగదారులు చెబుతున్నారు. గ్యాస్ బుక్ చేసిన తర్వాత సాధారణంగా 2 నుంచి 5 రోజుల్లో డెలివరీ కావాల్సి ఉన్నా, ప్రస్తుతం 15 నుండి 20 రోజుల వరకు ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వినియోగదారులు 20 రోజులు గడిచినా సిలిండర్ అందక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ బండ్ల ధరలు అమాంతం పెరిగి రూ.4000 నుంచి రూ.6000 వరకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు పదుల సంఖ్యలో సిలిండర్లు నిల్వ చేసుకుని అవసరాన్ని ఆసరాగా చేసుకుని యథేచ్ఛగా విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కొంతమంది కిరాణా దుకాణాలు, టిఫిన్ సెంటర్ల వద్ద కూడా ఈ సిలిండర్లు అధిక ధరలకు లభించడం సర్వసాధారణంగా మారింది. బుక్ చేసిన సిలిండర్లు వినియోగదారులకు అందకపోయినా, అదే సిలిండర్లు ఇతరులకు విక్రయమవుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డెలివరీ బాయ్స్ ఇంట్లో ఎవరూ లేరు అడ్రస్ దొరకలేదు వంటి కారణాలు చూపించి సిలిండర్లను తిరిగి తీసుకెళ్లి, తరువాత అధిక ధరలకు విక్రయిస్తున్న ఘటనలు ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కొంతమంది వినియోగదారులు బుక్ చేసిన గ్యాస్‌ను తీసుకోకపోతే, వాటిని సిస్టంలో నమోదు చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు మళ్లిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.ముఖ్యంగా మధురవాడలోని కొమ్మాది శివశక్తి నగర్ రోడ్డులో ఉన్న "దివ్య లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీలో ఈ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెలివరీ సిబ్బంది సిలిండర్లను అనధికారికంగా హోటల్స్, వ్యాపారులకు విక్రయిస్తూ భారీగా లాభాలు పొందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.దేశంలోని పలు నగరాల్లో కూడా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తుండటం గమనార్హం. "ఘోస్ట్ డెలివరీల్లు, అక్రమ రీఫిల్లింగ్ కేంద్రాలు, డీలర్లు-డెలివరీ సిబ్బంది కుమ్మక్కై బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్న ఘటనలపై జాతీయ స్థాయిలో వార్తలు వస్తున్నాయి. దీంతో గ్యాస్ సరఫరా వ్యవస్థలో లోపాలపై ఆందోళన వ్యక్తమవుతోంది.ఇంత జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు నిమ్మక నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దళారులు బహిరంగంగా సిలిండర్లు నిల్వ చేసుకుని విక్రయిస్తున్నా, తనిఖీలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. వంటగ్యాస్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు, మరోవైపు అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ ప్రజలు కోరుకుంటున్నారు..పౌర సరఫరాల శాఖతో పాటు లీగల్ మెట్రాలజీ అధికారులు కూడా రంగంలోకి దింపి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ బండ్ల బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా అరికట్టి, సరఫరాలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఈ దందాపై వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వినియోగదారుల రక్షణకు అమెజాన్ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్

**ఆరిలోవ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

నకిలీ వస్తువుల నుండి వినియోగదారులను, బ్రాండ్లను రక్షించాలనే తన ప్రపంచ స్థాయి నిబద్ధతలో భాగంగా అమెజాన్ తమ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్‌ను (సి సి యు) భారత దేశానికి విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విభాగం అమెజాన్‌కు చెందిన స్థానిక నిపుణులను ఒక చోటకు చేర్చి భారతీయ బ్రాండ్ల అమ్మకదారులు, పోలీసు విభాగాలతో కలిసి పనిచేస్తుంది. భారత దేశానికి కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్ విస్తరణ అనేది అమెజాన్ ఇండియాలో (అమెజాన్.ఇన్) కస్టమర్లు, అమ్మకందారుల రక్షణ పట్ల సంస్థకు ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. కస్టమర్లను, బ్రాండ్లను నకిలీ వస్తువుల నుండి రక్షించడం అనేది మా స్టోర్‌పై నమ్మకాన్ని నిలబెట్టడానికి విక్రయదారులను కాపాడటానికి చాలా ముఖ్యం" అని అమెజాన్ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్ డైరెక్టర్ కెబారు స్మిత్ పేర్కొన్నారు. నకిలీ వస్తువులకు వ్యతిరేకంగా తాము ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న పోరాటం వల్ల మిలియన్ల కొద్దీ డాలర్ల నష్టాన్ని నివారించగలిగామని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4సి) భాగస్వామ్యంతో ఇప్పటికే చేపట్టిన స్కామ్ స్మార్ట్ ఇండియా వంటి కార్యక్రమాలకు ఈ కొత్త ప్రయత్నం మరింత బలాన్ని చేకూరుస్తుంది.

## అభివృద్ధి దిశగా పెంపుడు జంతువుల సంరక్షణ ఆర్థిక వ్యవస్థ

**ఆరిలోవ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ప్రస్తుత రోజుల్లో ఇళ్లలో పెంపుడు జంతువులను కుటుంబ సభ్యుల్లా ప్రేమిస్తూ, సంరక్షిస్తూ, పోషిస్తున్నారు. ఈ గాఢమైన భావోద్వేగ బంధం భారతదేశం అంతటా "పెట్ పేరెంట్స్ వృద్ధికి అద్దం పడుతోంది. ఈ మార్పు కేవలం భావోద్వేగపరమైనది మాత్రమే కాదు. ప్రజలు తమ రోజువారీ జీవితంలో ఎలా షాపింగ్ చేస్తున్నారు, ఖర్చు చేస్తున్నారు, తమ పెంపుడు జంతువుల శ్రేయస్సుకు ఎలా ప్రాధాన్యత ఇస్తున్నారు అనే దానిలోనూ ఇది ప్రతిబింబిస్తుంది. భారతదేశపు పెంపుడు జంతువుల సంరక్షణ పరిశ్రమపై ఐ బి ఈ ఎఫ్ రిపోర్ట్ ప్రకారం, పెరుగుతున్న ఖర్చు చేయగల ఆదాయాలు, పట్టణ జీవనశైలి, పెంపుడు జంతువుల శ్రేయస్సుపై బలమైన దృష్టి కారణంగా ఈ రంగం దాదాపు 20 శాతం వృద్ధిని సాధిస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌లో, పెంపుడు జంతువుల సంరక్షణ పట్ల పెరుగుతున్న, జీవనశైలి ఆధారిత విధానంలో ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విభాగం 50శాతం కంటే వార్షిక వృద్ధిని సాధిస్తోంది. కుక్కలు, పిల్లుల నుండి చేపలు, పక్షులు, ఇతర పెంపుడు జంతువుల వరకు, వినియోగదారులు రోజువారీ అవసరాల నుంచి ప్రీమియం ప్రత్యేక ఉత్పత్తుల వరకు అన్నింటికీ ఈ ప్లాట్‌ఫామ్‌ను ఒక ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు. నేడు జెన్ జీ, మిలీనియల్ వినియోగదారులు ఫ్లిప్‌కార్ట్‌లోని మొత్తం డిమాండ్‌లో 80 శాతం కంటే వాటాను కలిగి ఉన్నారు. వీరు పెంపుడు జంతువుల సంరక్షణ పట్ల మరింత అవగాహన కలిగిన, పరిణతి చెందిన దృక్పథాన్ని తీసుకువస్తున్నారు. బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలు కీలక డిమాండ్ కేంద్రాలుగా ఆవిర్భవిస్తున్నాయి.

## విశాఖ ట్రాఫిక్ ఏసీపీగా సిహెచ్ రవికాంత్ నియామకం

**(విశాఖక్రైం, ప్రభాతవార్త)**





రాష్ట్ర పోలీసు శాఖలో పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయి. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫార్సుల మేరకు పలువురు డీఎస్పీలకు బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ క్రమంలో డీఎస్పీగా ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న సిహెచ్ రవి కాంత్‌ను విశాఖపట్నం ట్రాఫిక్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా బదిలీ చేశారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న ఎస్. వాసుదేవ్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.ఇదే ఉత్తర్వుల్లో భాగంగా మరికొంతమంది అధికారులకు కూడా బదిలీలు చేపట్టారు. పోలీసు శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందిం చేందుకు ఈ మార్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.సంబంధిత అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## విశాఖలో హెచ్‌సీలు, పీసీల బదిలీలు

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**

నగర పోలీసు కమిషనరేట్‌లో సివిల్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుళ్లు , పోలీసు కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. సంబంధిత సిబ్బంది అభ్యర్థనల మేరకు ఈ మార్పులు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఉత్తర్వుల ప్రకారం ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ చి. లోవ రాజును ద్వారకా లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే పెందుర్తి లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్. నూకరాజును మహిలా పోలీస్ స్టేషన్‌కు పంపించారు. ఇక టూ టౌన్ సీసీఎస్‌లో ఉన్న కె. శంకర్‌ను, త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో పనిచేస్తున్న ఎం. సురేష్ కుమార్‌ను, భీమిలి క్రైమ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎం. రాజేష్‌ను కూడా మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే తమ కొత్త స్థానాల్లో హాజరుకావాలని, సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు.

## ఆరిలోవ లో టీబీ ముక్త భారత్ అభినయ కార్యక్రమం

**ఆరిలోవ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

జాతీయ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు ఆరిలోవ ఎర్ని దుర్గా నగర్ లో అధ్యక్షులు పి ఐ బాలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ హరిత (డబ్ల్యూ హెచ్ ఎస్ ) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స ను తెలియజేశారు. రెండు వారాల మించి జ్వరం ఉన్నట్లయితే, అదేవిధంగా కఫంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం వంటివి టీబీ వ్యాధి లక్షణాలని అవగాహన కార్యక్రమంలో తెలియజేశారు. టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయిలో మెరిసిన ఎన్‌బిఎమ్ విద్యార్థి

- పవర్ లిఫ్టింగ్‌లో భవాని ప్రసాద్‌కు స్వర్ణ విజయం
- విశాఖలో జరిగిన ఏపీ స్టేట్ పోటీల్లో ఘనత
- డెడ్‌లిఫ్ట్‌లో 210 కేజీలతో అద్భుత ప్రదర్శన
- కళాశాలలో ఘన సన్మానం
- డీన్, ప్రిన్సిపల్ అభినందనలు..విద్యార్థులకు స్ఫూర్తి
- క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని పిలుపు

**(విశాఖపట్నం, ప్రభాతవార్త)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్.బి.ఎమ్ లా కళాశాల విద్యార్థి వి. భవాని ప్రసాద్ ప్రతిభ చాటుతూ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. 2026 సంవత్సరానికి సంబంధించిన ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించిన డెడ్‌లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో ఆయన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు.విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మార్చి 28, 29 తేదీలలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించగా, 105 కేజీల మాస్టర్స్ విభాగంలో భవాని ప్రసాద్ తొలి స్థానం సాధించారు. అదే విభాగంలో 210 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తి ప్రత్యేకంగా నిలిచారు. ఈ విజయానికి గుర్తింపుగా ఆయన్ను మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరించారు.ఈ సందర్భంగా శుక్రవారం ఎన్.బి.ఎమ్ లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డీన్ రమణ, ప్రిన్సిపల్ గాయత్రి చేతుల మీదుగా భవాని ప్రసాద్‌కు సర్టిఫికెట్ అందజేసి, బంగారు పతకాన్ని ప్రదానం చేశారు.డీన్ రమణ మాట్లాడుతూ, క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం గర్వకారణమని, క్రమశిక్షణతో ముందుకు సాగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించే అవకాశం ఉందని అభినందించారు. ప్రిన్సిపల్ గాయత్రి మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం సమగ్ర అభివృద్ధికి దోహదమని పేర్కొన్నారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు భవాని ప్రసాద్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

**మాధవధార, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



వ్యాపారుల మోసాలకు పలువురు వినియోగదారులు బలవుతున్నారని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్.ఎస్.రామానుజ స్వామి తెలిపారు. మురళీనగర్ లో గల సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించకుండా పలు సంస్థలు, వాపార వర్గాలు ప్రజల నుంచి అక్రమంగా అధిక ధరలకు తమ వస్తువులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. తమ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు కూడా ఏ వస్తువు కొన్న బిల్లు తీసుకోకపోవడం వ్యాపారాలకు అనుకూలంగా మారిందన్నారు. బిల్లు ఇవ్వకపోతే ఆయా వ్యాపార సంస్థలు ప్రభుత్వానికి జీఎస్టీ ఎగ్గొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయం తాము ప్రజలను చైతన్యం చేసేందుకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. పలువురు వినియోగదారులకు న్యాయ సహాయం చేసినట్లు వెల్లడించారు. ఏ వస్తువు కొనుగోలు చేసిన తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. నిర్విరామ సేవా కార్యక్రమాలు, ఎంతోమందికి తను చేసే మంచి కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తూ, సేవా రంగంలో మంచి గుర్తింపు పొందిన తమ సంస్థ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ గారా సత్యనారాయణ గోవాలో డాక్టర్ తీసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ డాక్టర్ గారా సత్యనారాయణ, సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ మార్టిన్ ఫేరీరా, సౌత్ ఇండియన్ వైస్ చైర్మన్ డాక్టర్ రజనీకాంత్, సౌత్ ఇండియా ఆర్గనైజేషన్ సెక్రటరీ డి.దేముడు, అనకాపల్లి జిల్లా చైర్మన్ డాక్టర్ శేషు కుమార్ పాల్గొన్నారు.

## చందనోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష

### - కళ్యాణమండపాల ప్రారంభోత్సవం ఈఓ జె. వెంకట్రావు

**సింహాచలం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక చందనోత్సవ (ఏప్రిల్ 20న) ఏర్పాట్లపై శనివారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, మరియు కమిషనర్, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పాల్గొని ఉత్సవ ఏర్పాట్లపై చర్చించనున్నారు. ఉదయం 11:30 గంటలకు కలెక్టరేట్‌లో మంత్రుల బృందం మరియు అధికారులతో కలిసి చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు. సమీక్ష అనంతరం కొండపైన భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను మంత్రుల బృందము పరిశీలిస్తారు. ముఖ్యంగా ఎండ తీవ్రత దృష్ట్యా క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది కలగకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, స్కానింగ్ పాయింట్ల వద్ద సిబ్బంది కేటాయింపు, ఎంట్రన్స్ పాయింట్ల వద్ద రద్దీ నియంత్రణ చర్యలను సమీక్షిస్తారు. అనంతరము మధ్యాహ్నం 3:00 గంటలకు సింహాచలం దేవస్థానం వారిచే కొండ దిగువన శ్రీనివాసనగర్‌లో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాలను మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

## ఎన్ ఏ డి పరిధిలో నేడు పవర్ కట్

**మాధవధార :ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ లో తేన్నేటి నగర్,కరసా,సీతన్న గార్డెన్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం నాడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ 2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.దీంతో తేన్నేట్టి నగర్, కనక దుర్గ కళ్యాణ మండపం,సమాజం, గాయత్రి స్కూల్, సీతన్న గార్డెన్స్, నరసింహ నగర్,విద్య నగర్, ఎం ఎన్ ఆర్ పార్క్,ఓల్డ్ కరసా,న్యూ కరసా, ఎన్ ఏ డి, సాయిబాబా గుడి,రామాలయం గుడి పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.




## నూతన పంచాయతీ కార్యదర్శిని కలిసిన గోవిందరావు



గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని సంకాడ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రాజుబాబును టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలగుచ్ఛం అందజేసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల పరిస్థితిని, స్థానిక అంశాలను కార్యదర్శికి వివరించారు. యూనిట్ ఇన్‌చార్జ్ మామిడి చంటిబాబు, పిసా (శిఖితి) ఉపాధ్యక్షులు సద్ద బొజ్జిపడల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సృష్టి క్షేత్రం నిర్మాణానికి ఆటంకాలు తొలగాలని పూజలు



నర్సీపట్నం,ఏప్రిల్ 10, ప్రభాతవార్త: నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద సృష్టి క్షేత్రం పేరిట ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన 108 అడుగుల శివపార్వతుల విగ్రహాల నిర్మాణానికి అడ్డంకులు తొలగాలని కోరుతూ శ్రీదుర్గామల్లేశ్వరి స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ జంపెన నాగేంద్రరాజు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ మాట్లాడుతూ నర్సీపట్నంలో నిర్మిస్తున్న సృష్టి క్షేత్రానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, వైసీపీ నాయకులు దుష్టశక్తుల్లా మారి అడ్డు తగులుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్యక్రమంలో నర్సీపట్నం టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మూడు లారీలు సీజ్



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): నక్కపల్లి టోల్ ప్లాజాను తప్పించుకుని ఇతర రహదారి మార్గాల ద్వారా వెళుతున్న భారీ వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న భారీ వాహనాలు శుక్రవారం చట్టపరమైన చర్యలు నిమిత్తం ఆర్టీవోకు అప్పగించారు. సిఐ మురళి,ఎస్సై సన్నీ బాబులు మాట్లాడుతూ మండలంలోని ఉపమాక ప్రాంతం నుంచి వేంపాడు మీదిగా ఈ విధంగా భారీ వాహనాలు ఈ రహదారిలో వెళితే చర్యలు తప్పు అని హెచ్చరించారు.

## రోడ్డు మధ్యలో గుంతలు.. పట్టించుకోని అధికారులు





ఎలమంచిలి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల డ్రైనేజీలు నిర్మాణాలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్న స్థానిక 8, 7 వార్డులు మధ్యలో గొల్ల వీధి రోడ్డు మధ్యలో కల్వర్టుకు రంధ్రం పడి ఉన్న ఇప్పటికీ అధికారులు పట్టించుకోలేదంటూ ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప కల్వర్టు నిర్మాణ పనులు మాత్రం చేపట్టడం లేదని మరి ఎవరికి చెబితే ఈ నిర్మాణ పనులు చేపడతారో ఆ ప్రాంత ప్రజలకు అర్థం అవటం లేదు. మున్సిపాలిటీలో అధికారులు అవసరమైన చోటు తప్ప అవసరం లేని చోటు నిర్మాణ పనులు కాలవనిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్డు వేసిన దాని మీదే కూడా రోడ్లు వేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఎర్రవరం కాలువ నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఆ కాలువ నిర్మాణ పనులను ప్రవేశించే అధికారులు కరువయ్యారు అనేది ఆ కాలువ నిర్మాణం చూస్తేనే అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మధ్యలో రంధ్రం పడిన కల్వర్టుకు వెంటనే నిర్మాణం పనులు చేపట్టాలని, ఎన్టీఆర్ కాలనీలో కూడా కల్వర్టునిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాదర్బార్‌లో ప్రతి సమస్యకూ పరిష్కారం : సియ్యారి




అరకులోయ, ఏప్రిల్ 10, ప్రభాత వార్త : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు అనూహ్య స్పందన లభిస్తుందని, ఇక్కడికి వచ్చే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ప్రజల్లో పెరిగిందని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయ నగరం జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు అరకులోయ లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కు వచ్చే ప్రతి సమస్యకూ పరిష్కారం చూపారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి గెమ్మెలి బిమల, పార్లమెంట్ టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు శంకర్ నాయుడు, అరకువేలి ఎస్ టి సెల్ అధ్యక్షులు బురిడీ కొములు నాయుడు, ప్రధానకార్యదర్శి కొర్ర సంతోష్, టి ఎన్ టి యు సి అధ్యక్షులు తాంగుల రాజకుమార్, అరకులోయ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనంద్, పెదలబుడు మాజీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, నాయకులు పాడి బాలన్న,, సొమెలి లక్ష్మయ్య, వి ఈశ్వర్ రావు, సుబ్బారావు, కృష్ణారావు, పెదలబుడు మాజీ ఎంపీటీసీ కిల్లో కుమార్, కుంతురు సుబ్బారావు, రాంబాబు, కొర్ర సుబ్బారావు, వంతల వెంకట్ రావు, పాంగి భగత్ రామ్, సిరాగం, పూజారి మాణిక్యం, బోయి దామోదర్, పూజారి లక్ష్మినారాయణ, కొర్ర శేఖర్, కిల్లో నాగరాజు, కిల్లో మోహన్ దాస్, కొర్ర బాలరాజు, జన్ని సీతారాం, కర్రిబాబు, డుంబరి లచ్చన్న, రాజారావు, వంతలా బుద్దు, పాంగి కిరణ్, కొర్ర ఒనోతి రామ్, సివేరి బీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు ప్రణాళిక తయారుచేయాలి : కలెక్టర్



పాడేరు,ఏప్రిల్10, ప్రభాతవార్త: జిల్లాలో భూగర్భ జలాలను పెంచే విధముగా ప్రణాళికలు తయారు చేయాలని, చెక్ డ్యాములు, ఫారం పాండ్స్, సోక్ పిట్‌ల నిర్మాణాలకు మండలాల వారీగా మ్యాపులను తయారు చేసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ నిశాంతి. టి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరం నందు అధికారులతో జిల్లాలో నీటి భద్రత, సంరక్షణ కొరకు చేపట్టవలసిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదవుతుందని, దానికి అనుగుణంగా భూగర్భ జలాలను పెంచే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లాలో అత్యధిక ప్రజలు లబ్ది పొందే విధముగా అధికారులు నీటి నిల్వనకు చెక్ డ్యాములు, ఫారం పాండ్స్, సోక్ పిట్స్, వర్షపు నీటిని నిల్వ చేయడానికి నిర్మాణాలను అధిక మొత్తంలో చేపట్టాలన్నారు. నీటి సంరక్షణకు ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్మాణాలు ఎక్కడెక్కడ చేపట్టవలసిన ఉంటుందో అధికారులతో సమన్వయం చేసుకొని మండలాల వారీగా మ్యాపులు తయారు చేసుకోవాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా జిల్లాకు ఎక్కువ ప్రయోజనం జరిగే విధంగా నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా నీటి నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు. ప్రతి రైతు వ్యవసాయ పొలం దగ్గర నీటి బావులను తవ్వించడం ద్వారా నీటి నిల్వతో పాటు సంవత్సరం పొడవునా పంటలు పండించడానికి వీలు కలుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఇంకుడు గుంతలను ఎక్కువ మొత్తంలో నిర్మించాలన్నారు. అధికారులందరూ అంకితభావంతో పనిచేసి ఈ కార్యక్రమం ద్వారా భరోసా కలిగే విధంగా రైతులకు ఎక్కువ లబ్ది చేకూరే విధముగా పనిచేయాలన్నారు. జిల్లాలో ఎక్కువ వర్షపాతం నమోదు కొరకు ఎక్కువ మొత్తంలో చెట్ల పంపకాన్ని చేపట్టాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. సాగునీటి సంఘాలను బలోపేతం చేసి జలదార జల హారతి పథకంలో భాగ్యస్వాములు చేయడం ద్వారా జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి విద్యాసాగర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాలు నోడల్ అధికారి పిఎస్. కుమార్, జిల్లా ఇంచార్జ్ అటవీ శాఖ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం కీలకం



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని జీకేవీధి వైద్యాధికారులు శివరామ్, రుషశ్రీ తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తహసిల్దార్ అన్నాజీరావు సమక్షంలో శుక్రవారం జీకేవిధిలో పోషణ పక్వాడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. సున్నా నుండి రెండేళ్ల పిల్లలుకు సరైన పోషణ అందిస్తే వారి మేధాశక్తి పెరుగుతుందన్నారు. పిల్లలు భవిష్యత్తుకు అదే సరైన సమయమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఎక్కువగా ఫోన్ ఇచ్చి వారి మెదళ్లను పాడు చేయవద్దని సూచించారు. పిల్లలు అధికంగా స్క్రీన్ టైమ్‌లో ఉండటం వల్ల కంటితో పాటు మెదడు సంబంధ వ్యాధులకు గురవుతారని పేర్కొన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక హోదా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకులు వలసమ్మ, మోహిని, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాపై అవగాహన



అరకలోయ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : అరకులోయ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాల్లో శుక్రవారం ఖిపోషణ పక్వాడఖి పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యం, గర్భిణులు, బాలింతల పోషణపై సంపూర్ణ అవగాహన కల్పించడమే పోషణ పక్వాడ ప్రధాన ఉద్దేశం అని అరకులోయ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని లక్ష్మి లావణ్య, సుంకరమెట్ట సెక్టర్ సూపర్వైజర్ రామకృష్ణమ్మ లు ఈ సందర్భంగా తెలియజేశారు. దీనిలో భాగంగా మండలంలోని జనం గూడ, సుంకరమెట్ట కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల మేధో శక్తి అభివృద్ధికి తల్లిపాలే శ్రేష్టమని, దీంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు గర్భిణీలు బాలింతలకు తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె అన్నారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలో అన్నదానిపై సంపూర్ణ అవగాహన కల్పించారు. అదే విధంగా పిల్లలు మొబైల్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. ఈ విషయంపై ప్రతి తల్లి జాగ్రత్త వహించవలసి ఉంటుందని ఆమె సూచించారు చిన్నారుల మెదడు అభివృద్ధిలో 90 శాతం తల్లిపాల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని వారు గుర్తుచేశారు. ఆహార నియమాలలో బాలింతలు జంక్ ఫుడ్ (బయటి ఆహారం) కు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. కేవలం ఇంట్లో తాజాగా తయారుచేసిన పౌష్టికాహారాన్ని మాత్రమే తీసుకోవాలని ఆమె సూచించారు. అంగన్వాడీలు భాగ్యలక్ష్మి, లలిత కుమారి, అప్పలమ్మ, శాంతి, వెంకటలక్ష్మి, భాను, జ్యోతి,జమ్మి బిమల, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో సీఎంను కలిసిన కిడారి శ్రావణ్



పాడేరు, ఏప్రిల్10, ప్రభాతవార్త: అమరావతి సచివాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన వివాహ శుభలేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసి పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలని ఆహ్వానించారు. శ్రావణ్ కుమార్‌తో ఆత్మీయంగా మాట్లాడిన ముఖ్యమంత్రి పెళ్లి తేదీని తన షెడ్యూల్‌లో నమోదు చేయాలని సిఎం సూచించారు. అలాగే వధువు వివరాలను తెలుసుకుంటూ, ఆమె స్వగ్రామం, విద్యార్హతలు, ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాలపై ఆసక్తిగా సిఎం శ్రావణ్ అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

## బీజేపీ బలోపేతమే లక్ష్యం



గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) : గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని శ్యామగడ్డ గ్రామంలో మన ఊరు మన జెండ్గా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. చల్లంగి అచ్యుత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనపై ఆకర్షితులై గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు, గ్రామస్తులు బిజెపిలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ముఖ్య అతిథులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి మఠం శాంతకుమారి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు సైతం వైద్యం, విద్య, రహదారి సౌకర్యాలను కల్పించిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. బిజెపి కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అణగారిన వర్గాల గొంతుకగా ఒక శక్తిలా ఎదుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో వార్డు మెంబర్ నుండి ఎంపీ స్థానం వరకు బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కాకూరు శేఖర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి సరభ వేమన బాబు, చల్లంగి అచ్యుత్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేజీయ రాణి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ (జీకే వీధి ఎంపీటీసీ) రీమల రాజేశ్వరి, సీనియర్ నాయకులు బోండ్ల చిరంజీవి, జిల్లా గిరిజన మోర్చా కార్యదర్శి ముట్టడం లక్ష్మణ్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి లకే ప్రసాద్, గ్రామ పెద్దలు కోపూరి కొత్తయ్య, పోత్తూరు వెంకట్రావు మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రబీ వేరుశనగతో అధిక లాభాలు



గూడెం కొత్తవీధి ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): ధారకొండ పంచాయతీ పరిధి దారాలగొందిలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు వేరుశెనగ పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగుపై పలు సూచనలు చేశారు. రబీ సీజన్ కోసం ప్రభుత్వం 90 శాతం రాయితీపై వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండటం వల్ల వేరుశెనగ పంటకు మేలు జరుగుతుందన్నారు. వర్షాలు తక్కువగా ఉంటే మొక్క శాఖీయ పెరుగుదల తగ్గి, భూమి గుల్లబారుతుం దని. దీనివల్ల ఊడలు సులభంగా భూమిలోకి వెళ్లి కాయలు ఎక్కువగా ఊరుతాయని వివరించారు. నీటి వసతి ఉన్న చోట వేరుశెనగ సాగు అత్యంత లాభదాయకమని, రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జోసెఫ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పిల్లల కదలికలపై నిఘా ఉంచాలి : ఎమ్మెల్యే రేగం



అరకులోయ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : అరకు నియోజకవర్గం, హుకుంపేట మండలం, బూర్జ గ్రామ పంచాయతీ, జంబవలస గ్రామ పరిధిలోగల మల్లంగుమ్మి జలపాతంలో ఈతకు వెళ్లిన త్రిష, పవిత్ర,రత్నకుమారి మృతి చెందిన విషయం విధితమే. పోస్టుమార్టం నిమిత్తం మృతి దేహాలను అరకు ఏరియా ఆసుపత్రికి తరలించగా ..విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం ఉదయం ఆసుపత్రి కి చేరుకుని ప్రమాద ఘటనకు గల కారణాలు తెలుసుకొని తీవ్ర దిగ్భ్రాంతి చెంది,మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మృతుల కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా చెరో 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం ను అందజేశారు. కాగా రెవెన్యూ శాఖ నుండి ఒక్కో కుటుంబానికి 10 పదివేల రూపాయలు చెప్పున అందజేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్,అరకు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ రాము, వైసీపీ అరకు నియోజకవర్గం సోషల్ మీడియా ఇంచార్జ్ కొర్ర రామ్, వైసీపీ అరకు వ్యాలీ మండలం ఎస్టి సెల్ అధ్యక్షుడు పాంగి నగేష్, పోలీస్ సిబ్బంది,మృతుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐటీడీఏ పీవోగా ఆదిత్యవర్మ బాధ్యతల స్వీకరణ





పాడేరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా ఐఎఎస్ 2022 బ్యాచ్ కేడర్‌కు చెందిన ఆదిత్యవర్మ శనివారం ఉదయం ఏడు గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే ఇప్పటి వరకు పీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2022 ఐఎఎస్ బ్యాచ్ కు చెందిన తిరుమాని శ్రీపూజను జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించడంతో జేసీగా నేడు పూర్తి స్థాయి బాధ్యతలు శనివారం స్వీకరించనున్నారు.పాడేరు ఐటిడిఎ పీఓగా భర్త ఆదిత్య వర్మ, జిల్లా జేసి శ్రీ పూజ దంపతులు ఒకేరోజు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ





పాడేరు, ఏప్రిల్10, ప్రభాతవార్త: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జిఆర్ఎస్) కు 136, రెవెన్యూ క్లినిక్ కు 28 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఇంచార్జి డిఆర్ఓ,కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు, ఇంచార్జి ఆర్డిఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడంలో పాడేరు, వివిధ మండలాల తాసిల్దార్, డిటి వి.ధర్మారావు, పి.పోతురాజు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది పాల్గొని అందుబాటులో ఉండి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదుల నుండి అర్జీలు స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీదారులకు తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారి మాత్రమే హాజరుకావాలని అలా హాజరుకాలేని అధికారి ముందుగానే అనుమతి పొందాలని కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది అధికారులు ఒకటి, రెండు జిల్లాల్లో ఇన్చార్జిలుగా విధులు నిర్వహిస్తున్న వారు వారానికి మూడు రోజులు ఇక్కడ, మూడు రోజులు అదనపు జిల్లాల పని చేయాలని ఆమె స్పష్టం చేసారు. శాఖపరమైన ఏ అనుమతులు కైనను అధికారి మాత్రమే వచ్చి అనుమతి పొందాలన్నారు. పి జి ఆర్ ఎస్ లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని నమోదు కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారి ఉండాలని ఆమె అన్నారు.ప్రతి సోమవారం జరిగే జిల్లా అభివృద్ధి సమావేశంలో సంబంధిత శాఖకు సంబంధించిన ప్రణాళిక రూపొందించుకొని సమావేశానికి హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి అధికారుల సమన్వయాన్ని సిపిఓ కో ఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో ఎక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు రారని, అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ప్రతి ఒక్కరికి జిల్లా అధికారుల వివరాలు తెలిసి ఉండాలని, మండల తాసిల్దార్, ఎంపీడీవో, మండలనికి సంబంధించిన అధికారుల వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే గ్రీవెన్స్ ను కూడా నిర్ణీత గడువులోపు అర్జీ దారునితో మాట్లాడి సమస్యను పరిష్కరించి, గ్రీవెన్స్ పోర్టర్ లో అప్లోడ్ చేసి ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. అలా క్లియర్ చేసినప్పుడు మాత్రమే పోర్టల్ లో పెండింగ్ లేకుండా ఉంటుందని లేకుంటే పదే పదే అప్లికేషన్ రిపీట్ అవుతుందన్నారు. గ్రీవెన్స్ లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందన్నారుఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ , జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి. మురళి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. కృష్ణమూర్తి నాయక్ , స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, పలువురు తాహాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి : దొన్నుదొర



అరకులోయ, ఏప్రిల్10, ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీని గ్రామీణ స్థాయిలో మరింతగా బలోపేతం చేసే దిశగా శ్రేణులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర సూచించారు. అరకులోయ లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కేడర్ తో సమావేశం నిర్వహించారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. పార్టీ విధి విధానాలు పార్టీ తెలియజేసే ఆదేశాలను సిరసా పాటించాలని చెప్పారు. పంచాయతీల పరిధిలో జరిగే ప్రతి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సమస్యల గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామీణ సమస్యల పరిష్కారంతో ప్రజలతో సత్సంబంధాలు పెరుగుతాయని పార్టీ బలోపేతం అయ్యే దిశగా అడుగులు పడతాయని చెప్పారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పిఎం జన్ మన్ గృహాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మన ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పలానా అభివృద్ధి చేశామని చెప్పుకునే విధంగా పార్టీ శ్రేణులంతా దృష్టి సారించాలని సూచించారు. పార్టీ బలోపేతం చేయాల్సిన అవసరం ఎక్కడైతే ఉందో అక్కడ ఎక్కువ దృష్టి సారించాల్సిన ఉందన్నారు. బూత్ అబ్జర్వర్ ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేసి దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్త అధినేతని చెప్పారు. ఆ విషయాన్ని ఎవరూ మరవద్దని చాలా క్రమశిక్షణ గల పార్టీలో ఉంటున్నామని గౌరవంతో మనమంతా కూడా ఒక కుటుంబ సభ్యుల బతుకుతున్నామన్నారు. చిన్నచిన్న ఇబ్బందులు వచ్చినా సమన్వయం చేసుకొని ముందుకు నడుద్దాం అని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి పోరా వైభవం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గెమ్మెలి బిమల, శంకర్‌నాయుడు, బురిడీ కొములు నాయుడు, కొర్ర సంతోష్, తాంగుల రాజకుమార్, పార్టీ మండల అధ్యక్షులు లోక్కోయ్ మహాదేవ్, కిల్లో ఆనంద్, పెట్టేలి దాసు బాబు, పాడి బాలన్న, సొమెలి లక్ష్మయ్య, భీంపోలు ఈశ్వర్ రావు, సుబ్బారావు, కృష్ణారావు, కిల్లో కుమార్, కుంతురు సుబ్బారావు, తాంగుల రాంబాబు,, కొర్ర సుబ్బారావు, వంతల వెంకట్ రావు, పాంగి భగత్ రామ్, పూజారి మాణిక్యం, బోయి దామోదర్, పూజారి లక్ష్మినారాయణ, శేఖర్, కిల్లో నాగరాజు, కిల్లో మోహన్ దాస్, కొర్ర బాలరాజు, జన్ని సీతారాం, సీసా కర్రిబాబు, డుంబరి లచ్చన్న, రాజారావు, వంతలా బుద్దు, పాంగి కిరణ్, కొర్ర ఒనోతి రామ్, సివేరి బీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు ఐటీడీఏ సందర్శన



పాడేరు,ఏప్రిల్ 10, ప్రభాతవార్త : కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోట) డైరెక్టర్ డాక్టర్ వర్ణాలి దేక అల్లూరి జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా పాడేరు ఐటీడీఏ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్, ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి నిశాంతి,జాయింట్ కలెక్టర్ శ్రీ పూజా పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా ఇన్చార్జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గిరిజన ప్రాంతంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలపై క్షుణ్ణంగా వివరించారు. ముందుగా మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ డైరెక్టర్ వారిని పుష్పగ్నుచ్ఛ అందించి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి.స్వాగతం పలికారు. అనంతరం పాడేరు మండలం, ముంతమామిడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాడేరు ఐటిడిఎ ద్వారా రూ. 60 లక్షల పీఎం జన్మన్ నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజక భవనాన్ని ఆమె సందర్శించారు. భవన నిర్మాణ తీరును, అందుబాటులో ఉన్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.వనధన్ వికాస్ ఉత్పత్తుల పరిశీలించి, అదే భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన డైరెక్టర్, వనధన్ వికాస్ కేంద్రం ద్వారా తయారవుతున్న వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తుల నాణ్యత, వాటి మార్కెటింగ్ వివరాల గురించి ఆరా తీశారు. స్థానిక గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఇటువంటి కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఐటీడీఏ అధికారి, జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ , కందమామిడి గిరిజన బాలికల పాఠశాలను సందర్శించి విద్య, వసతి పై ఆరా తీసి, భోజనశాలను సందర్శించి పిల్లలకు అందిస్తున్న భోజన సౌకర్యం పై పిల్లలని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి.బి.కె పరిమళ, ఐ సి డి ఎస్ పి డి ఝాన్సీరామ్ పాడల్, ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ మరియు భవనాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి మెడకు బిగిసుకున్న తాడు



పాడేరు,ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గిరిజన సంప్రదాయ ఇటుకలు పండుగ సందర్భంగా తాచేరు వసూలు కోసం కట్టిన తాడు అటుగా వస్తున్న సాయి అనే యువకుడు మెడకు తగిలి బిగుసుకుపోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ యువకుడ్ని హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రి తరలించి తాడు తొలగించి చికిత్స అందజేశారు.

vsp11:vsp11.qxd 10-04-2026 21:42 Page 1






## ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలి : జడ్పీ సీఈవో



గొలుగొండ, ఏప్రిల్10, ప్రభాతవార్త: ప్రభుత్వం అన్ని రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తుందని ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేసేలా అధికారులు పాటుపడాలని పరిషత్ సీఈవో నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం విశాఖపట్నం నుంచి విచ్చేసిన ఆయన గొలుగొండ మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛరథం పనితీరును జోగుంపేటలో ఆయన స్వయంగా పరిశీలించారు. అన్ని అంశాల్లో ప్రజా భాగస్వామ్యం పెంచాలని ప్రభుత్వం ఆలోచన చేసి ముందుకు సాగుతుందన్నారు. ఇంటిదగ్గర ఉపయోగం లేని ప్లాస్టిక్ ఇతర వస్తువులను స్వచ్ఛర దానికి అప్పగిస్తే నిత్యవసర సరుకులు తగినవి అందిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల స్వచ్ఛత కోసం ప్రభుత్వం నేరుగా వ్యర్థాలను సేకరించి ఇంటికి ఉపయోగపడే వస్తువులను అందిస్తుంది అన్నారు. ఇళ్ల వద్ద తడి పొడి చెత్తను వేరు చేసి క్లాత్ మిత్రాలకు అందిస్తే వాటిని సంపద కేంద్రాలకు తరలించి ఆదాయ వనరులుగా మార్చే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రభుత్వం విజన్ 2047 లక్ష్యంగా పనిచేస్తుందని ఇందులో పొందుపరిచిన సంస్కరణలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం మండల పరిషత్ భాను ఆధునికరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేసి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడే స్థానిక జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఎంపీడీవోతో స్థానిక పరిస్థితులపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మహేష్, జోగంపేట కార్యదర్శి రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగపర్చుకోండి



చోడవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పీఎం సూర్యగర్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగ పరుచుకో వాలని స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సూర్యగర్ మఫ్త్ బిజిలి యోజన ఎస్సీ ఎస్టీ గృహ వినియోగదారుల పథకంలో బాగంగా గురువారం చోడవరం ఎమ్మెల్యే కే.స్.యన్.స్ రాజు చోడవరం నియో జవర్గంకు సంబంధ్నిచిన కార్యక్రమాన్ని ప్రారంభోత్స్నవ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలకి 200 రూపాయలు అద్దె చెల్లించడం జరుగుతుందని ఇంటిపై ఉన్న ఖాళీగా ఉన్న పైకొప్పుని నియోగించు కోవడం ద్వారా ఈ సౌకర్యాన్ని ఎస్సీ ఎస్టీ వినియోగదారులు అందరూ విని యోగించుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం కుసుం కార్యక్రమం గురించి తెలియజేశారు. పి ఎం కుసుం పథకంలో భాగంగా వినియోగదారులు తమ భూమిని లీజుకి ఇవ్వడం ద్వారా సంవత్సరమునకు 31వేలు రూపాయలు లీజు చెల్లించిపడుతుందని ప్రతి రెండు సంవత్సరాలకు ఐదు పర్సెంట్ పెరుగుతుందని ఈ స్కీంని వినియోగించుకోవాల్సిందిగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఇందులో ఎస్సి 4626, ఎస్టి 1553 మొత్తం కలిసి 6179 మంది ఉన్నారని. ఇంకా ఎవరైనా సంసిద్ధంగా ఉన్నాయెడల త్వరితగతిన ఇస్తామని చెప్పారు. నియోజవర్గం లో నాలుగు మండలాలు కలిపి అగ్రికల్చర్ కనెక్షన్లు ఇప్పటివరకు 360 రిలీజ్ చేశామని మిగతావి త్వరలో రిలీజ్ చేస్తామని అన్నారు. అలాగే అభివృద్ధి పనులు నిమిత్తం డ్యామేజ్ అయిన పోల్స్ ని మార్చడం,5 అదనపులోడు లోడ్ కలిగిన ట్రాన్స్ఫార్మర్‌కు అదనపు ట్రాన్స్ఫార్మర్ వేయడం జరిగింది దానికీ సుమరుగా రూపాయిలు 24 లక్షలు, ఏ బి స్విచ్లు వాటిని పునరుద్ధరించడం, పాడైపోయిన కండక్టర్, కేబుల్ మార్చడం, నాణ్య మైన విద్యుత్తు సరఫరా కోసం ఆర్‌డిఎస్ఎస్ పథకంలో భాగంగా ఫీడర్ల విభజన పనులు జరుగుతు న్నామని తెలియజేసారు. అలాగే పిఎం సూర్య ఘర్ ద్వార సోలార్ ప్యానల్ ను నియోజవర్గం మొత్తం 657 బిగించినారని తెలియజేస్తూ వినియోగదారులకి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తూ అలాగే నియోజవర్గం కూడా అభివృద్ధిలో తీర్చిదిద్దుకుంటూ ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఏపీపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఆఫీస్ జి.ప్రసాద్,నర్సీపట్నం ఈ ఈ ఎస్ రామకృష్ణ, చోడవరం డీఈఈ వై. సురేష్ కుమార్, మాడుగుల డీఈఈ ఏ. సురేష్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పోషకాహార పక్షోత్సవ కార్యక్రమాలు



చోడవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల చోడవరం సెక్టార్ వెంకయ్య గారి పేట అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే అనర్థాలు గురించి అలాగే పిల్లలను ఫోన్ కి దూరంగా ఉంచడానికి తల్లిదండ్రులు చేయవలసిన కార్యక్రమాల గురించి అలాగే తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి పుట్టిన పిల్లవానికి ఆరు ఏళ్ళు నిండిన వరకు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తల కోసం తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లలలో ఆరు ఏళ్ల లోపే వాళ్ల మెదడు అభివృద్ధి అనేది 90 శాతం జరుగుతుంది కాబట్టి ఆ సమయం చాలా కీలకమైనదని తెలిపారు. ఈ సమయంలో మంచి ఆహారం, సరైన రక్షణ, మంచి ఆరోగ్యం ఉండేలా చూసుకోవాలని సూపర్వైజర్ బి శాంతిప్రియ తల్లిదండ్రులకు సూచించారు. చోడవరం సెక్టార్ అంగన్వాడి టీచర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రాజుపేటలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



గొలుగొండ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలంలో కొత్త ఎల్లవరం పంచాయతీ రాజుపేట గ్రామంలో ఫార్మాజెల్ వారి సహకారంతో ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. .15లక్షల ఆర్థిక సహాయంతో ఫార్మా జెల్ సమకూర్చి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా ప్లాంట్ నిర్మాణం చేసినట్లు తెలిపారు. శుక్రవారం తాగునీటి ప్లాంటును నర్సీపట్నం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి రాజాన సూర్య చంద్ర ఫార్మా జెట్ ప్రతినిధులు శ్రీనివాసరావు, అప్పారావు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఫార్మా జెల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇక్కడ ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు మాజీ సర్పంచ్ రాంబాబు ప్రత్యేకమైన చొరవ చూపారని అన్నారు. ఈ ప్లాంట్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గంలో నీటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లు రాంబాబు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాద హరినాథ్, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## స్ప్రేయింగ్ పిచికారీపై శిక్షణ



చోడవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో స్ప్రేయింగ్ పిచికారి చేయు విధానాలపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 15 నుంచి స్ప్రేయింగ్ పిచికారి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జిల్లా మలేరియా అధికారి కే వరహాలు, అసిస్టెంట్ మలేరియా అధికారి ఏజే సత్యనారాయణ సమక్షంలో సిబ్బందికి ఐఆర్ఎస్ స్పెయింగ్ పిచికారిపై అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి ఎస్‌వి రమణతోపాటు వివిధ పీహెచ్సీల నుంచి వచ్చిన సూపర్వైజర్లు, హెచ్‌వీలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కసింకోట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త; కశింకోట సెక్షన్ పరిధిలోని 33/11 కె.వి బయ్యవరం సబ్ స్టేషన్ మరియు 33/11 కె.వి కశింకోట సబ్ స్టేషన్ పరిధిలో 11 కె.వి కశింకోట ఫీడర్ ఇండస్ట్రియల్ ఫీడర్ తేగాడ ఏజీఎల్ ఫీడరు కశింకోట ఎంహెచ్ క్యు ఫీడర్ హెచ్డి లైను క్రింద ఉన్న తగులుతున్న చెట్లు, కొమ్మలు కొడుతున్న కారణంగా శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు, బయ్యారం, కశింకోట సబ్ స్టేషన్ పరిధిలోని కశింకోట, బయ్యవరం , తెగడ , వెదురుపర్తి, గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందనీ ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ టి మురళీకృష్ణ తెలిపారు. కావున ఆయా గ్రామాల ఏపీ ఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా రోడ్లు



ఎలమంచిలి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పట్టణంలోనే ఉదయం నుండే భానుడి ప్రతాపానికి పట్టణ ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 8 గంటల నుండి సూర్య భగవానుడు తన విశ్వరూపం చూపించాడు. పిల్లల మొదలుకొని పెద్దల వరకు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. ఎండ తీవ్రత దృశ్య తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వైద్యాధికారులు సూచనలు చేస్తున్నారు.

## రైతులు సుస్థిర వ్యవసాయం చేయాలి : ఏవో ఉమాప్రసాద్



నక్కపల్లి, ప్రభాతవార్త : గుల్లిపాడు గ్రామంలో ధర్తీ మాతా బచావో అభియాన్ (భూమాత రక్షణ ప్రచారం) పై రైతులకు అవగాహన కార్యక్రమము నిర్వహించారు. మేరకు రైతులకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సుస్థిర వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని, సారాన్ని పునరుద్ధరించడానికి ఉద్దేశించిన ఒక ఉద్యమం. ఈ చొరవ కింద, నేల పరీక్షలు, సమతుల్య ఎరువుల వాడకం, కార్బన్ ఎరువులు ప్రోత్స హించడం ద్వారా రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు అవలబించేలా ప్రోత్సహించడం జరుగు తుంది అన్నారు. ధర్తీ మాతా బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశ్యాలు తెలియజేశారు. నేల సంరక్షణ: రసాయన ఎరువులు (యూరియా) వాడకాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడటం. సుస్థిర వ్యవ సా యం రైతులు రసాయన రహిత లేదా తక్కువ రసాయనాలతో వ్యవసాయం చేసేలా ప్రోత్సహించడం పట్ల అవగాహన, నేల సారాన్ని పెంచడం పంట ఉత్పాదకతను స్థిరంగా పెంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. కమిటీల ఏర్పాటు విషయమై ఈ ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి గ్రామ/పంచాయతీ స్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ ప్రచారం వలన నేల ఆరో గ్యాన్ని మెరుగుపరచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు రైతు ఆదాయాన్ని పెంచడానికి సహాయప డుతుందని రైతులకు తెలియజేశారు. గ్రామపెద్దలు, గ్రామవ్యవసాయ సహాయకులు లావణ్య పాల్గొన్నారు.

## సీతయ్యపేటలో బెల్ట్ షాపు కలకలం...అధికారుల నిర్లక్ష్యం



బుచ్చయ్యపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : సీతయ్యపేట గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాప్‌పై గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ ఇందిరా శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు కూడలిలో ఉన్న ఈ బెల్ట్ షాప్ కారణంగా ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణించే వారు, రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. బెల్ట్ షాప్ పక్కనే రెండు మెడికల్ షాపులు, అలాగే స్టేట్ బ్యాంక్ ఉండటంతో అక్కడికి వచ్చే కస్టమర్లు, ద్వారా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం విద్యార్థులు తరచూ వెళ్లే మార్గం కావడంతో వారి భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ విషయంపై స్పందించిన మాజీ సర్పంచ్ వజ్రపు ఇంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ,"గ్రామం మధ్యలో బెల్ట్ షాప్ ఉండటం అనేది పూర్తిగా అనుచితం. వెంటనే ఈ షాపును గ్రామానికి దూరంగా తరలించాలి. లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతాం" అని హెచ్చరించారు.గ్రామ ప్రజలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

## వైసీపీ మండల అధ్యక్షుడిగా గొర్లె గోవింద్.. పలువురు సత్కారం





(నక్కపల్లి, ప్రభాతవార్త): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా పెద్ద దొడ్డిగల్లు ఎంపీటీసీ భర్త గొర్ల గోవిందు ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించినట్లు కేంద్ర కమిటీ నియామకం ఉత్తర్వులను అందజేసింది. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా కమిటీలో నక్కపల్లి మండలానికి కేంద్ర కమిటీ పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారు. పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయ కర్త ,మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ,విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి వీసం రామకృష్ణ నాయకత్వంలో మండలంలోని పలువురు నాయకులను మండల కమిటీలో ఎంపిక చేశారు. మండలంలోని సీతంపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గొర్ల గోవిందరావును అధ్యక్షుడుగా నియమిం చడంతోపాటు ఉపాధ్యక్షు లుగా సాదిరెడ్డి శ్రీను, జుల్లూరి లక్ష్మిపతి రాజు, ప్రధాన కార్యదర్శులుగా అల్లు రమణ, కొల్నాటి దుర్గా ప్రసాద్, ఏరిపల్లి నగేష్, దమ్ము అప్పారావు లను నియమించడంతో పాటు 6 సభ్యులకు అదనపు కార్యదర్శులుగా 18 మందికి కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎంపికైన గొర్ల గోవిందును పార్టీ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ నాయకత్వంలో పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ రామకృష్ణ నాయకత్వంలో నక్కపల్లి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. నియామకం పట్ల రామకృష్ణతో పాటు మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రసాద్ ,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర కన్వీనర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు లతోపాటు దంతులూరి దిలీప్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. గోవింద్ సత్కరించువారిలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అయినంపూడి బంగారాజు ,విద్యార్థి విభాగం కన్వీనర్ ఎలమంచిలి చందు, ఎల్లేటిసత్యనారాయణ ,ముద్ద శ్రీను, మాజీ సర్పంచ్ గొర్ల నాగఅప్పలరాజు ,మాజీఉప సర్పంచ్ వీసం రాజు తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

## ఎస్. రాయవరంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



ఎస్. రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఎస్ .రాయవరం గ్రామంలో నూకంబిక అమ్మవారి గంధ అమావాస్య జాతర సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ పోటీలను నక్కపల్లి రూరల్ సీఐ ఎల్.రామకృష్ణ,ఎస్సై ఏ.విభీషణ్ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలకు సుమారు 30 జట్టులు పాల్గొంటు న్నాయని క్రికెట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 30వేల రూపాయలు రెండో బహుమతి 20 వేల రూపాయలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొణతాల శ్రీనివాసరావు, సోమిరెడ్డి రాజు. తాజా మాజీ ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, క్రికెట్ కమిటీ సభ్యులు వీసం సాయి ,పితాని సతీష్ ,కర్రి తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథాన్ని సద్వినియోగపర్చుకోండి : ఎంపీడీవో



ఎస్.రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: వమ్మవరంలో రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన స్వచ్ఛరథంను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో మీనా కుమారి అన్నారు. శుక్రవారం వమ్మవరం, సైతారుపేట ,సర్వసిద్ధి గ్రామాల్లో పర్యటించారు. ఇంటి వద్ద ఉపయోగపడలేన టువంటి వాడుకులో లేనటువంటి ఉన్న వస్తువులను స్వచ్ఛ రథం అప్పగిస్తే వాటికి తగ్గట్టు నిత్యావసర వస్తువులను పొందవచ్చు అన్నారు. ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలను పరిశీలించి గ్రామాల్లోని చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య వంతులుగా ఉంటామనన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలతో సమావేశాలు నిర్వహించారు . కార్యక్రమంలో సర్వసిద్ధ స్పెషలాఫీసు మనోరమ ఆయా గ్రామ అధికారులు, సిబ్బంది,పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పెనుగొల్లు గ్రోయిన్ పరిశీలన



ఎస్.రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాత వార్త: మండలంలోని వరాహనది సమీపంలోని పెనుగొల్లు గ్రోయిన్‌ను పాయకరావుపేట డివిజన్ ఇరిగేషన్ డి ఈ సురేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు .గ్రోయిన్ మరమ్మతులు చేయడానికి ఇటీవల 99 లక్షలు మంజూరు కావడం నిర్మాణ పనులు ప్రారంభించడంతో అందులో భాగంగా పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. నిర్మాణ పనులు సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఏఈ భాను, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత




అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 10 : (ప్రభాత వార్త) జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఉత్తర్వుల మేరకు అనకాపల్లి సబ్ డివిజనల్ డీఎస్పీ ఎం. శ్రావణి ఆదేశాల మేరకు రోడ్డు భద్రత, డ్రగ్స్ వ్యతిరేకతపై అనకాపల్లి రూరల్ పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్ర మాలు విరివిగా చేపడుతున్నారు. శుక్రవారం మామిడిపాలెం, రేబాక, మారేడుపూడి, కొప్పాక, కూండ్రం, సంపతిపురం, పిసినికాడ తదితర 15 చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కలుగజేస్తున్నారు. ప్రధానంగా హెల్మెట్ లేని డ్రైవింగ్ ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు ప్రయాణించరాదని, ఓవర్ లోడ్ వెహికల్స్, లైసెన్స్ లేని డ్రైవింగ్, చిన్నపి ల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణం కాకూడదని ఎక్కడికక్కడ ప్రజల్లో చైత న్యం కలిగేలా విశేష కృషి చేస్తున్నారు. యువత మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చైతన్యం కలిగిస్తున్నారు. రూరల్ సీఐ జి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.రవికుమార్ తన సిబ్బందితో గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో విశేషంగా కృషి చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసమే లక్ష్యం



ఎస్. రాయవరం, ఏప్రిల్ 10, ప్రభాత వార్త : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసమే మా లక్ష్యం పిఆర్‌టియు మండల అధ్యక్షులు బాలు అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ కు విద్యార్థుల నుండి అనుహ్య స్పందలభిస్తుందని తుని,ఎలమంచిలి, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, అచ్యుతాపురం, ఎస్ రాయవరం మండలాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారన్నారు. వారు గత కొన్ని సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీట్లు సాధించడం, ఉద్యోగాలు పొందడం పట్ల సమాజంలోని వివిధ వర్గాల నుండి ప్రశంసలు పొందుతుందని చదువుకోవడం వలన జూనియర్ ఇంజనీర్ లేదా టెక్నిషియన్ స్థాయి ఉద్యోగాలను పొందవచ్చని, ఎస్ ఎస్ సి పిఎస్యు వంటి రంగాలలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు సివిల్ మెకానికల్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ సైన్స్ వంటి అనేక విభాగాలలో స్పెషలైజేషన్ చేసే అవకాశం లభిస్తుందని మన ప్రాంతం పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సమయం కాబట్టి వివిధ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయని సూచించారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు బాలు, ఆదర్శ కాలేజ్ ప్రిన్సిపల్ సీతారామరాజు పిఆర్‌టియు నాయకులు శ్రీను ,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా బీసీ విభాగ అధ్యక్షుడిగా గొర్ల నరసింహమూర్తి







(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంద విభాగమైనజిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా మాజీ నక్కపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు ,ప్రస్తుత దేవవరం ఎంపీటీసీ భర్త గొర్ల నరసింహమూర్తికి చోటు దక్కింది. ఆయనతో పాటు రాష్ట్ర అనుబంధ విభాగాలైన వైసీపీ అనుబంధ విభాగంలో పలువురు సీనియర్ నాయకులకు రాష్ట్రస్థాయిలో పలు కమిటీల్లో మాజీ ముఖ్యమంత్రి ,జాతీయ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించినట్లు కేంద్ర కమిటీ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు మండలంలోని డిఎల్ పురం గ్రామానికి చెందిన మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు లొడగల చంద్రరావుకి రాష్ట్ర ప్రచార విభాగంలో సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఆయనతోపాటు బుచ్చిరాజుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొర్ల బాబురావు రాష్ట్ర బూత్ కమిటీల వింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారి నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తో పాటు రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు,మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ ,శాసన మండల ప్రతిపక్ష నేత, మాజీ మంత్రిబొత్స సత్యనారాయణ ,జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడు ప్రసాద్ ,పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ,పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకు శోభ హైమావతి,నియోజకవర్గ పరిశీలకులు దంతులూరు దిలీప్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సిరం నరసింహమూర్తి ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తలు నాయకులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా ఎన్నికైన గొర్ల నరసింహమూర్తి ,రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమితులైన లోడగల చంద్రరావు, గొర్ల బాబురావులు మాట్లాడుతూ జాతీయ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ గ్రామాన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ,రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున విజయం సాధించినట్లు ఇప్పటినుంచి గ్రామాల్లో పనిచేస్తామని చెప్పారు .వారి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## పోషణ పక్వాడా ప్రారంభం



నర్సీపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండలం ధర్మసాగరం గ్రామంలో శుక్రవారం 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఐసీడీఎస్ పీడీ ఎన్. సూర్యలక్ష్మీ హాజరై మాట్లాడారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని చెప్పారు. గర్భిణీలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. మన పిల్లల అభివృద్ధి, ఆరోగ్యం మనమే కాపాడుకోవాలని చెప్పారు. అలాగే పిల్లలు ఎక్కువగా సెల్ఫోన్లు చూడటం వల్ల మాటలు ఆలస్యంగా వస్తాయన్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని చెప్పారు. నెల 23వ తేదీ వరకు ఈ పోషణ పక్వాడా కార్యక్రమాలు జరు గుతాయని వివరించారు. జెడ్పీటీసీ సుకల రమణమ్మ, సీడీపీఓ జీవీ.రమణి, టీడీపీ మండల అధ్యక్షులు సుకల అప్పలనాయుడు, సెక్రటరీ సూర్యకళ, వీఆర్వో పి.పార్వతి, పాఠశాల హెచ్ఎం వెంకటలక్ష్మీ, సూపర్వైజర్ పి.అప్పలనర్స,అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నడపాలి



నర్సీపట్నం,ఏప్రిల్10,ప్రభాతవార్త: మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వమే నడపాలని సీఐటీయు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 4వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వం పాఠశాలల్లో వంటలు చేస్తున్నారన్నారు. వీరిని తీసేసి స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకి ఇవ్వాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు. కావున ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని పథకాన్ని ప్రభుత్వమే కొనసాగింపు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్నం భోజన కార్మికులకి కనీస వేతనాలు రూ.10వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, భీమా సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీన జీతాలు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ చిన్నికృష్ణుడ్ని కలిసిన కొప్పిసెట్టి వెంకటేష్



(నక్కపల్లి, ప్రభాతవార్త): అనకాపల్లి మండలానికి నూతన తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చిన్ని కృష్ణుని శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిసెట్టి వెంకటేష్ మర్యాదపూర్వ కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం మండలానికి సంబంధించిన పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏపీఐఐసీలో కొంతమంది రైతులకు సాంకేతిక కారణాలవల్ల భూపరిహారం అందే విషయంలో నష్టం జరిగిందని ఆయన చేయాలని వెంకటేష్ కోరారు. స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే కాకుండా ఆర్డిఓ వివి రమణ దృష్టికి కూడా వెంకటేష్ తాసిల్దార్ చిన్ని కృష్ణుని కలిసిన వారిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు ,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయినవెంకటరమణ, మాజీ సర్పంచులు కాళ్ల శ్రీను, మండల మహిళా అధ్యక్షురాలు మునిషా బేగం, దార్ల కృష్ణ గణేష్ ,జగన్నాధపురం శ్రీను, ఎరుపల్లి అప్పలరాజు తదితరులు ఉన్నారు .



## ఎంవీఆర్ రాకతో అనకాపల్లిలో మారిన పాలిటిక్స్



అనకాపల్లి, ఏప్రిల్ 10, (ప్రభాత వార్త) : నూతన జిల్లా రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు "ఎంవిఆర్ " నామస్మరణే వినిపిస్తోంది. తన సేవా దృక్పథంతో ఇప్పటికే వేలాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఎం వి ఆర్, ఇప్పుడు ఆ ప్రజాబలాన్ని బీజేపీ బలోపేతానికి మళ్లించడంతో కాషాయ దళంలో కొత్త కళ కనిపిస్తోంది. ఎం వి ఆర్ అభిమాన గణం , యువసేన సభ్యులు ఏకతాటిపైకి వచ్చి బీజేపీ సభ్యత్వం స్వీకరించడం అనకాపల్లి రాజకీయాల్లో ఒక సంచలనంగా మారిందని చెప్పవచ్చు. ఎంవీఆర్ రాజకీయం అంటే కేవలం పదవులు, ప్రసంగాలు మాత్రమే కాదు.. అది నిరంతర ప్రజాసేవ అని ఆయన అభిమానులు చాటిచెబుతున్నారు. వేసవి వేడి నుంచి ప్రజలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు మొదలుకొని, ఆధ్యాత్మిక చింతనతో కూడిన తీర్థయాత్రల వరకు.. ఆయన చేస్తున్న పనులు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఎవరు పిలిచినా పలకడం, కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా ఇవ్వడం ఎం వి ఆర్ ప్రత్యేకత. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని యువత ఎం వి ఆర్ నాయకత్వం వైపు ఆకర్షితులవుతున్నారు. ఆయనలో ఉన్న కార్యదక్షత, పారదర్శకత యువసేనను బీజేపీ వైపు అడుగులు వేయించాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఒక పక్క సక్సెస్ ఫుల్ గా బిజినెస్ రన్ చేస్తూనే, మరోపక్క సామాన్య ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం అరుదైన విషయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎం వి ఆర్ ఎంట్రీతో అనకాపల్లిలో బీజేపీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించడంలో ఆయన సక్సెస్ అయ్యారని చెప్పవచ్చు.

## కుటుంబ కలహాలతో అత్తను చంపేశాడు



కొయ్యలగూడెం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం పరిధిలోని తారక రామానగర్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, అనుమానం ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. తన భార్యను కాపురానికి పంపడం లేదన్న కోపంతో, మద్యం మత్తులో ఉన్న అల్లుడు కన్నతల్లి లాంటి అత్తను కత్తితో పొడిచి అతి దారుణంగా హత్య చేశాడు. ఘటన వివరాల్లోకి వెళ్తే స్థానిక తారకరామానగర్‌కు చెందిన పోల మంగమ్మ (68), ఆమెకు 8 మంది సంతానం అందులో ఐదుగురు కొడుకులు ముగ్గురు కుమార్తెలు వారిలో రెండవ కుమార్తె భర్త అయిన కేదారి పుల్లయ్యకు అత్త పోలా మంగమ్మకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన పుల్లయ్య ప్రవర్తన నచ్చక అతని భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. అయితే, తన భార్య కాపురానికి రాకుండా అత్త మంగమ్మ అడ్డుపడుతోందని, ఆమె తన భార్యను తప్పుదోవ పట్టిస్తోందని పుల్లయ్య గట్టిగా నమ్మాడు. అత్తను చంపితేనే తన భార్య తిరిగి వస్తుందని పథకం వేశాడు. ఈ క్రమంలో, అర్ధరాత్రి సమయంలో మంగమ్మ నిద్రిస్తుండగా పుల్లయ్య కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావమై మంగమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు.

**పోలీసుల దర్యాప్తు:** ఘటనపై సమాచారం అందుకున్న కొయ్యలగూడెం ఎస్సై చంద్రశేఖర్ సిఐ బాల సురేష్ తమ సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. నిందితుడు కేదారి పుల్లయ్యపై కేసు నమోదుచేశారు, త్వరలోనే అతడిని పట్టుకుంటామని సిఐ బాలసురేష్ మీడియాకు వెల్లడించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు ప్రధాన కారణమని తెలిపారు.

## యువ న్యాయవాది అనుమానాస్పద మృతి



గుంటూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యడ్లవల్లిలో ఒంగోలుకు చెందిన యువ న్యాయవాది శ్రీరామ్ హరి ప్రసాద్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రోడ్డు పక్కన హరి ప్రసాద్ మృతదేహంపై స్కూటీ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహంపై స్కూటీ పడినట్టుగా ఉండటంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద స్థలంలో బండరాళ్లతో కొట్టిచంపినట్టు పోలీసులు గుర్తించారు. హరిప్రసాద్ 2018లో న్యాయవాదిగా ఒంగోలులో ప్రాక్టీస్ ప్రారంభించారు. వీరి కుటుంబం ప్రస్తుతం ఒంగోలులో ఉంటోంది. యువకుడి తల్లి ఒంగోలు జిల్లా కోర్టులో పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం హైకోర్టు పని మీద బయటకు వెళుతున్నానని తల్లి తిరుపతమ్మకు చెప్పి ఒంగోలు నుండి బయలుదేరిన వ్యక్తి ఉదయానికి చనిపోయినట్లు కోడలుకు ఫోన్ వచ్చిందని తల్లి కన్నీరు మున్నీరయ్యారు. ఎక్కడో చంపి యడవల్లి వద్ద తన కొడుకును పడేశారని, తన కొడుకుది ముమ్మాటికీ హత్యే అని తల్లి తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే హరిప్రసాద్ వివాదాలు జోలికి వెళ్ళే వ్యక్తి కాదని, ఎవ్వరితో ఎటువంటి శతృత్వాలు లేవని చెబుతున్నారు. ఈ క్రమంలో హరిప్రసాద్ మరణం ప్రమాదం వల్ల జరిగిందా లేక హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హీల్‌లో 11వ తరగతి ప్రవేశాలకు ప్రకటన

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి, భోజనం అందించే హీల్ ప్యారడైజ్ పాఠశాలలో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హీల్ సిఇఒ కె.అజయ్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 90 ఎకరాల సువిశాల ప్రాంగణంలో డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆంగ్ల మాధ్యమంలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపుల్లో 2026-27 విద్యా సంవత్సరం ప్రవేశాలకు హీల్ ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత తప్పనిసరి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతిలో 480 మార్కులు, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ విద్యార్థులు 400 పైన మార్కులు సాధించి ఉండాలి. తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం తప్పనిసరి అని విజయ్ కుమార్ వివరించారు. ఈ అర్హతలు ఉన్నవారు మే 18లోపు క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 91000 24438, 91000 24435 నంబర్లలో సంప్రదించవచ్చు.

## ఆయుష్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి ఆయుష్ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి మెంబర్ సెక్రటరీ శుక్రవారం ఒక పర్యటనలో తెలిపారు. విజయవాడలోని ఆయుష్ శాఖ కమిషనర్ నియంత్రణలో గల వివిధ ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మొత్తం 59ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేశామని, డాక్టర్ ఎన్ఆర్ఎస్‌జిఎసి, విజయవాడ, డాక్టర్ ఎఆర్‌జిహెచ్‌ఎంసి, రాజమండ్రి, డాక్టర్ జిజిహెచ్‌ఎంసి, గుడివాడ జిహెచ్‌ఎంసి, కడపలో పనిచేయవలసి ఉంటుందన్నారు. సంబంధిత విభాగంలో అర్హత కలిగిన డిగ్రీ, పర్మనెంట్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం పైన పేర్కొన్న అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునని ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి మెంబర్ సెక్రటరీ ఆ ప్రకటనలో కోరారు.

## 18న కొండపల్లిలో హెరిటేజ్ ట్రెక్కింగ్



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ప్రపంచవారసత్వ దినోత్సం సందర్భంగా ఈనెల 18న విజయవాడ, కొండపల్లిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా హెరిటేజ్ ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ, ఎన్‌టిఆర్ జిల్లా యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికారసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమాల వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. 18వ తేదీ ఉదయం 6గంటలకు కొండపల్లి ఖిల్లా పైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందన్నారు. క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ భాగస్వామ్యంతో విజయవాడలో హెరిటేజ్‌వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండపల్లిలో మూడురోజులపాటు కొండపల్లి బొమ్మలతో మేళా ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల 8వ తేదీ నిర్వహించిన బొమ్మలపోటీలో విజేతలకు లక్షరూపాయల విలువచేసే బహుమతులు అందచేస్తామన్నారు. 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో సంగీతఝురితో వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు ఎస్‌పి చరణ్, సునీత, తదితరులు పాల్గొంటారని కలెక్టర్ వివరించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌టాక్ విజయవాడ చాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని, ఆర్‌టిహెచ్ విజయవాడ సిఇఒ జి.కృష్ణన్, జిల్లా పర్యాటక అధికారి ఏ.శిల్ప, కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు

● మైనారిటీ సంక్షేమ శాఖ శాఖల మంత్రి ఫరూక్ ● పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళికబద్ద చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ శాఖల మంత్రి ఎస్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖలో తప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం సకాలంలో ప్రభావంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానంపై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రుల విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్దతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్ల న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలు కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళికబద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్యకుమార్‌లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.




# బిజెపి మరింత బలపడాలి

● ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నబిన్‌తో మాధవ్ భేటీ ● ఎపి కార్యక్రమాలపై అభినందనలు, మాధవ్ కృతజ్ఞతలు

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, హస్తినాపురంలో జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను కలిసి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముందుగా అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన బస్సు యాత్రకు సంబంధించిన చిత్రమాలిక పుస్తకాన్ని నితిన్ నబిన్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆయన అభినందనలు తెలియజేయగా, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలతో సమన్వయం, రాబోయే కార్యక్రమాల అమలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి 15 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయడం, కొత్త సభ్యులను చేర్చడం వంటి కార్యక్రమాలు కూడా ఈ ప్రణాళికలో భాగంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంతో రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఉత్సాహం లభిస్తుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ జీ, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ జీ, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతురమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రవేశద్వారం జగ్గయ్యపేటకు మహర్దశ

● అమరావతి ఇండస్ట్రియల్ హాబ్ తొలి నగరంగా జగ్గయ్యపేట ● విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్



గౌతమ బుద్ధ ప్రతిమతో ఏర్పాటుచేసిన ప్రగతిపథం స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

జగ్గయ్యపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రవేశద్వారంగావున్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి మహర్దశ వచ్చిందని, అమరావతి ఇండస్ట్రియల్ హాబ్ తొలి నగరంగా జగ్గయ్యపేట అవతరించబోతోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిదే ందుకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) గ్రాంటు నుండి విడుదలైన రూ.7.15 నిధులతో పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గౌతమ బుద్ధ ప్రతిమతో ఏర్పాటుచేసిన ప్రగతిపథం స్తూపాన్ని, శిలాఫలకాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా తొలుత మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల మున్సిపల్ చరిత్రలో ఏ పాలకవర్గానికి లభించని కీర్తి తమను వరించిందన్నారు. వందల కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి పర్చుకోవటం గర్వకారణమన్నారు. ఆధునాతన రహదారుల నిర్మాణం, మురుగునీటి పారుదల కల్వర్టులు, ఆధునీకరణ, ప్రతి ఇంటికి మంచినీటి పంపు నూరుశాతం మౌళిక సదుపాయాల కల్పన కూటమి ప్రభుత్వంలో నేతలు ఎంపి శివనాథ్, ఎమ్మెల్యే రాజగోపాల్, కెడిసిసి చైర్మన్ రఘురామ్ సహకారంతో అమలులోకి వస్తుండటం ఎంతో సంతోషాని న్న కలిగించిందన్నారు. ఎంపి శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సిఎం చంద్రబాబు అహర్నిశలు పరిశ్రమిస్తున్నారన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు సమకూర్చి దేశంలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ పట్టణంలో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.7.15 కోట్లు మంజూరు చేయటం ద్వారా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతుందన్నారు. యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ మాట్లాడుతూ విజయవాడకు సాటిగా జగ్గయ్యపేటలో అభివృద్ధి పనులు జరుగుతుండటం నాయకుల గొప్పతనానికి నిదర్శనమన్నారు. కాగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సచివాలయ సిబ్బంది ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నేతలు ఉద్యోగుల భద్రత, బంగారు భవిష్యత్తు గురించి వివరించి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నేతలు శ్రీరాం ధనుంజయ, నూకల కుమారరాజ, ధూళిపాళ లక్ష్మణరావు, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, కట్టా వెంకట నరసింహారావు, కె కిషోర్, నజీమూన్, కౌన్సిలర్లు బుజ్జిబాబు, వెంకట్, సైదేశ్వరరావు, కంచేటి గీతారాణి, నాగరాజు, వెంకట్రామయ్య, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి 47 అర్జీలను స్వీకరించారు.

# ఇంద్రకీలాద్రి కొండచరియల పటిష్టతపై ఎన్ఐఆర్ఎం అధ్యయనం




ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వెలసిన ఇంద్రకీలాద్రి కొండ చరియల పటిష్టతపై ఎన్ఐఆర్ఎం (నేషనల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్) బృందం అధ్యయనం చేసేందుకు బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ నుండి సాంకేతిక బృందం శుక్రవారం దేవస్థానానికి చేరుకుంది. ప్రముఖ శాస్త్రవేత్త ప్రసన్న జైన్ నేతృత్వంలోని ఈ బృందం ఇఒ శీనా నాయక్‌ను కలిసి, క్షేత్రస్థాయి పరిశీలనపై కావలసిన ఏర్పాట్లు పై చెక్ లిస్ట్ సమర్పించి, చర్చించారు. కొండపై తరచుగా రాళ్లు జారిపడుతున్న ప్రాంతాలు, ప్రస్తుతం పటిష్టంగా ఉన్న రాళ్ల విస్తీర్ణం, మట్టితో మిళితమై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బృందం విశ్లేషించనుంది. భవిష్యత్తులో కొండపై నిర్మించతలపెట్టిన పాశుపాతాలయం ప్రదేశం భూగర్భ పటిష్టతను, అలాగే 2వ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది. దేవస్థాన అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యయన నివేదికను సిద్ధం చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతను నిర్ధారించడానికి, శాశ్వతమైన నిర్మాణాలను చేపట్టడానికి ఎన్ఐఆర్ఎం ఇచ్చే సాంకేతిక నివేదిక ఒక బ్లూ ప్రింట్ లాగా పనిచేస్తుంది. ఇది దేవస్థానానికి భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ కవచం లాంటిదని ఈవో పేర్కొన్నారు. ఈ బృందంతో సాంకేతిక సలహాదారు సుబ్రహ్మణ్యం, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ ఆలయంలో ఇఓ పలు విభాగాల తనిఖీ:** దుర్గమ్మవారి ఆలయంలో ఈవో వీకే శీనా నాయక్ వివిధ విభాగాలను శుక్రవారం తనికీ చేశారు. దేవాదాయ కమిషనర్ ఆదేశాల ప్రకారం రద్దీ సమయంలో భక్తులకు అందుబాటులో ఉంటే సమస్యలు తెలుస్తాయాన్న అభిప్రాయంతో అన్ని ప్రదేశాలు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. దుర్గా స్నానఘాట్ నిత్యం పరిశుభ్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రేవు అంచుల్లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. దుర్గా ఘాట్ నుండి కేశ ఖండనశాల వైపు ఉన్న అండర్ పాస్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, కేశ ఖండనశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో అన్ని ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది సిబ్బంది గమనించి, రిపేర్లు ఉంటే చేయించాలని ఆదేశించారు. అక్కడ నుండి కాలినడకన కొండపైకి చేరి, భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్‌లో ఈ టాయిలెట్స్ సంఖ్య పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బస్ షెల్టర్, ఓం టర్నింగ్ ఏరియాలో భక్తుల సౌకర్యార్థం అప్పటికప్పుడు కాయిర్ మ్యాట్ వేయించారు. ఆలయం చుట్టూ వేస్తున్న చలువ పందిరి పరిశీలన చేసి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సిఐ గుణరామ్, ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రవీంద్ర, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మవారి సేవలో మంత్రి వాసంశెట్టి:** దుర్గమ్మవారిని శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ఏఈవో అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాన్ని బహుకరించారు.

**శానిటరీ ఇన్‌స్పెక్టర్ తొలగింపు:** ఇంద్రకీలాద్రి కొండదిగువున శ్రీ కనకదుర్గానగర్ మరుగుదొడ్లలో గుర్తు తెలియని యాచకునిగా భావిస్తున్న వ్యక్తి మరణించిన సంఘటనలో విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజినీ ప్రియను విధులు నుండి తాత్కాలికంగా తొలగించినట్లు ఇఓ వికె శ్రీనానాయక్ తెలిపారు.



# జులైలో అందుబాటులోకి భోగాపురం విమానాశ్రయం

### ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానికి ప్రభుత్వం ఆహ్వానం

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జులై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులు..

# 9.62 లక్షల ఉద్యోగాలు

### - కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి




విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపు. ఎపిఐఐసీ, టిసిఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఎపిఐఐసి, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం లభించినట్లు వివరించారు.

## అమరావతి 40ఏళ్ళయినా పూర్తి కాదు: సజ్జల

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్న ప్రాంతంలో రాజధాని అనేది 30-40 ఏళ్లు అయినా పూర్తి కాదని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. దీనికి ఛత్తీస్‌గఢ్‌లో నిర్మించిన నవ రాయ్‌పూర్ ఉదాహరణ అని ఆయన తెలిపారు. నవ రాయపూర్‌లో బిల్డింగ్‌లు మాత్రమే ఉన్నాయని కానీ జనం లేరని సజ్జల పేర్కొన్నారు. "చంద్రబాబు లెక్కల ప్రకారమే అమరావతి రూ.2-3 లక్షల కోట్లు కావాలి. ఇప్పుడు కేవలం పనిచేసే ఉద్యోగులు ఉండడానికి మాత్రమే కడుతున్నాడు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిలు వీరికి బంగ్లాలు మాత్రం కడుతున్నాడు. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లు డెవలప్ చేయాల్సి ఉంది. అది ఎప్పటికి అవుతుందో ఎవ్వరికీ తెలియదు. ఎలాంటి సౌకర్యాలు, సదుపాయాలు లేని చోట అంతంత డబ్బు పెట్టి ప్రజలు ఎలా ఉంటారు? జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రేట్లు పెట్టి ప్రజలు అక్కడికి ఎందుకు వస్తారు? ప్రజలు భరించలేని రేట్లతో ఏ సదుపాయాలూ లేనిచోట ఎందుకు ఉంటారు? మౌలిక సదుపాయాల కోసమే ఎన్ని లక్షల కోట్లు పెట్టాలి? ప్రజలు రాకుండా సిటీ ఎలా అవుతుంది" అని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.



## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కేంద్ర మాజీ ఎన్నికల కమిషనర్ గోపాలస్వామి, క్రీడాకారుడు పుల్లల గోపీచంద్, తెలంగాణ మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్, సింగర్ శ్రీకృష్ణ, వొజ్జల అద్వితీయ, అంబిక కృష్ణ, ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గ్రాండ్ ఫినాలేలో 'మిస్ తెలుగు యుఎస్‌ఏ 2026' కిరీటాన్ని గెలుచుకున్న అమూల్య బాల్మూరి



హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: గ్రాండ్ ఫినాలేలో 'మిస్ తెలుగు యూఎస్ఏ 2026' కిరీటాన్ని గెలుచుకున్న అముల్య బాల్మూరి కరీంనగర్‌కు చెందిన యువతి. గోల్డ్‌మన్ సాక్స్ ప్రొఫెషనల్ మరియు రచయిత్రి అయిన ఆమె, ఏప్రిల్ 4న జరిగిన గ్రాండ్ ఫినాలేలో 100 మంది పోటీదారుల నుండి ప్రత్యేకంగా పోటీలో నిలిచి టైటిల్‌ను గెలుచుకున్నారు. బి.శ్రీనివాస రావు (రిటైర్డ్, ఐ క్యాడ్ డిపార్ట్‌మెంట్), బి.రమల కుమార్తె అయిన అముల్య బాల్మూరి, మిస్ తెలుగు యూఎస్ఏ 2026 కిరీటాన్ని గెలుచుకున్నారు. ప్రస్తుతం టెక్సాస్‌లోని డల్లాస్‌లో నివసిస్తున్న అమూల్య, కరీంనగర్‌లోని చిట్యాలపల్లి గ్రామానికి చెందినవారు. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆల్వాల్‌లో నివసిస్తున్నారు. భోజరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ నేపథ్యంతో తన విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించిన అమూల్య, ఆ తర్వాత మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి, ప్రస్తుతం గోల్డ్‌మన్ సాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో విజయవంతమైన మార్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. రచనపై ఉన్న మక్కువతో ఆమె తన కథలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తూ, ప్రపంచవ్యాప్తంగా 90,000మందికి పైగా పాఠకులను సంపాదించుకున్నారు.

11skl13:11skl13.qxd 11-04-2026 00:32 Page 1



## బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పరమేశ్వరరావు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలానికి చెందిన బైపల్లి పరమేశ్వరరావు నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవన్ ఆదేశాలు మేరకు జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సేవభావం, సామాజిక స్పృహ కలిగిన పరమేశ్వరరావు టెక్కలి నియోజకవర్గంలో బీజేపీకి మంచి ఊపు తెచ్చిన వ్యక్తి. యువకుడు అయిన పరమేశ్వరరావు బీజేపీ అధికార ప్రతినిధికి అర్హుడని పలువురు భావిస్తూ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చేనాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టెక్కలి నియోజకవర్గం ఇంచార్జి కణితి కిరణ్ కుమార్, ఆమదాలవలస ఇంచార్జి పేడాడ రాంమోహన్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ చైర్మన్ గేదెల చైతన్య, సూడా చైర్మన్ కె రవికుమార్ పలువురు కూటమి నాయకులు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో బీజేపీ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు మాధవన్, తేజేశ్వరరావులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో ప్రతి సామాన్య కార్యకర్తకు అందుబాటులో ఉంటూ గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతనకి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి : రెడ్డిశాంతి



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో నూతనంగా పదవులు పొందిన నాయకులు శుక్రవారం స్థానిక వైకాపా క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ మ్మెల్యే రెడ్డి శాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియామకానికి సహకరించినం దుకు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్ఆర్సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శిగా పాతపట్నం పట్టణానికి చెందిన ఎరుకోల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా కొత్తూరు మండలానికి చెందిన చింతాడ సూర్యనారాయణ నియమితులైన నేపథ్యంలో వారిరువురు వైకాపా శ్రేణులతో కలిసి రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేయాలని ఆమె ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, నాయకులు ఏనుగుతల సూర్యం, ఐ.సింహాచలం, మీసాల రామకృష్ణ, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్లో ఆరోతరగతి ప్రవేశపరీక్ష



కంచిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఎంఎస్ పల్లి ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 12వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాన్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని చీఫ్ సూపరెండెంట్ నడకుడుటి శివప్రసాద్ తెలిపారు. డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎంఈఓ 2 చిట్టిబాబు మాట్లాడుతూ పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందు ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అలాగే హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేసారు. విద్యార్థులు సమయ పాలన పాటిస్తూ నియమ నిబంధనలు ఖచ్చితంగా అనసరించాలని చీఫ్ సూపరెండెంట్ నడకుడుటి శివప్రసాద్ తెలిపారు.

## జనగణన సర్వే సక్రమంగా జరగాలి : ఐటీడీఏ పీవో



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మే 1 నుంచి ప్రారంభం కానున్న జనగణన సర్వేను సిబ్బంది అందరూ సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం సీతంపేట వైటీసీలో ఎన్యూమరేటర్స్, సూపర్ వైజర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వెళ్లి జనగణన సర్వే చేపట్టాలని అన్నారు. సర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహాసిల్దార్ శ్రీకన్య, ఎంపీడీవో బీబీ మిశ్రో, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా .. పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతం : కూన



ఆమదాలవలస, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతం శ్రీకాకుళమని, జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్త రోడ్‌లో ఉన్న శాంతి కన్వెన్షన్ హాల్లో సిఎస్ఆర్ సమ్మెట్‌లో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ జిల్లా పెట్టుబడులకు ఉత్తమమైన, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణమని తెలిపారు. పారిశ్రామికి వేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమలు నిర్మిస్తే సమీపంలో నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులు సులభతరం అవుతాయని తెలిపారు. జిల్లాలో ఎప్పటికే ఉన్న నేషనల్ హైవేలు పరిశ్రమల రవాణాకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జిల్లాలో పెట్టుబడులు పెడితే ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. జిల్లాను పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పెట్టుబడుదారులు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు, బగ్గు రమణమూర్తి, గోండు శంకర్, మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నల్ దినాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆర్థిక వనరులను, జిల్లా ప్రగతిని వివరించారు. నాయకులు రాష్ట్ర కాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, కూన ఆంజనేయులు, బుడుమూరు సీతారాం, తాండ్ర హరి, హనుమంతు బాలకృష్ణ, గురుగుబెల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలి వైసీపీ నేతలక పిచ్చి ముదిరింది



కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వాస్తవాలు మాట్లాడుతుంటే ఆ మాటలకు సరైన సమాధానం చెప్పలేక సమాజం తలదించుకునే విధంగా టెక్కలి వైకాపా నేతలు మాట్లాడడం సిగ్గుచేటని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవింద రాజులు అన్నారు. శుక్రవారం సాయంత్రం కోటబొమ్మా లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ ప్రమాదం వెనుక అచ్చెన్నాయుడు పాత్ర ఉందని ఆ ప్రమాదంతో ముడి పెడుతూ వైకాపా నేతలు తప్పుడు కూతలు కూస్తున్నారని అది మంచి పద్ధతి కాదని అన్నారు. అచ్చెన్నాయుడు వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారంటే ప్రజల్లో ఆయనకు ఎంత విలువ ఉందో వేరే చెప్పనక్కర్లేదని అన్నారు. కింజరాపు కుటుంబాన్ని విమర్శించే స్థాయి ఎవరికి లేదని ఆయన జీవితం ప్రజా సేవకే అని రాజకీయాల్లో విమర్శకు ప్రతి విమర్శలు తప్పవని కానీ ఆధారాలు లేని విమర్శలు చేయడం సబబు కాదని అన్నారు.

## చొట్రాయిపురం ఎంపీపీ స్కూల్ తనిఖీ



కంచిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : కంచిలి మండలం చొట్రాయిపురం ఎంపీపీ స్కూల్‌ను మండల విద్యాశాఖధికారి సప్పటి శివరామ ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన సంగ్రహణాత్మక మూల్యాంకనము-2 పరీక్షల యొక్క అసెస్మెంట్ బుక్‌లెట్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మా పాఠశాలకు నరసన్నపేట మండలం కిల్లాం గ్రామంనకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ చింతపల్లి షణ్ముఖరావు 15000 రూపాయలు విలువ గల లౌడ్ స్పీకర్ మరియు భోజన ప్లేట్స్‌ను మండల విద్యాశాఖాధికారి సప్పటి శివరామ ప్రసాద్ చేతులు మీదుగా విద్యార్దులకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు మద్దు తిరుపతి రావు మాస్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సప్పటి శివరాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్దులు క్రమశిక్షణను, ప్రతిభా పాటవాలు గుర్తించి,పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి తనవంతుగా ఆర్థిక సహాయం అందించిన దాత యగు చింతపల్లి షణ్ముఖరావుకి, ఇంతటి సేవాకార్యక్రమంనకు సమన్వయకర్తగా వ్యవహరించిన చల్ల లింగమూర్తి మాస్టర్ కు,గ్రామం, పాఠశాల, మండల శాఖతరుపున, అభినందనలు తెలియజేస్తూ, విద్యార్దులు అందరూ నిరంతరం మంచి నడవడిక, పట్టుదల, కృషి, సహనం మరియు క్రమశిక్షణతో మెలిగినప్పుడు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు.

## సీతానగరంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



సంతబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మండలంలోని సీతానగరం గ్రామంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కాస్పా నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 58మంది రోగులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరీక్షలు నిర్వహించారు. వెన్ను, మోకాళ్ళు నొప్పులు, డయాబెటిస్, శ్వాస సమస్యలు, చర్మ రోగాలు, ఇతర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వారికి యోగ విశిష్టత, జీవన శైలి మార్పుల వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేసారు. మీకు దగ్గరలో ఉన్న ఆసుపత్రిలోని ఆయుర్వేద వైద్య సేవలు, ఉచిత యోగ శిక్షణ వంటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. వైద్యులతో పాటు యోగ గురువులు ఆసుపత్రి సిబ్బంది ఏ ఎన్ ఎంలు ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీలాపుపుట్టుగలో కాళీమాత ఆలయ ప్రతిష్ట



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : నీలాపుపుట్టుగ గ్రామంలో కాళీమాత ఆలయ ప్రతిష్ట మహోత్స వం మరియు హరేరామ హరేకృష్ణ యజ్ఞం ఈ నెల 15వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాహుదా జలాలతో శోభాయాత్ర నిర్వహించి పూర్ణకలశాలతో పవిత్ర జలాలను తీసుకొచ్చారు. నీలగిరి రామకృష్ణ సిద్ధాంతి, శ్యామసుందర సిద్ధాంతి, నారాయణపాడి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. 11న పూజలు, జలాభిషేకాలు నిర్వహిస్తారు. 12న ప్రతిష్ట, కుంకుమార్చన నిర్వహిస్తారు. ఈ నెల 15వరకు యజ్ఞం అనంతరం పూర్ణాహుతి ఉంటుంది. 9 భజన బృందాలతో భజగోవింద గోష్టి నిర్వహిస్తున్నారు.

## తులసమ్మ సంబరం నిర్వహణపై అధికారుల సమీక్ష



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ వార్షిక సంబరం ఈ నెల 12 ఆదివారం నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఓ జాతరలో కల్తీ బాదంపాలు తాగి 130 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా తులసమ్మ సంబరానికి ప్రభుత్వ అధికారులు సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్ వెంకటరావు పర్యవేక్షణలో పోలీస్, ఎలక్ట్రికల్, మెడికల్, పంచయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, మండల పరిషత్ అధికారులతో పాటు ఆలయ కమిటీతో చర్చించారు. సుమారు 20వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేశారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి తాగునీటి సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరా కల్పించాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెడికల్ క్యాంప్ నిర్వహించాలని, ఆహార నాణ్యత కల్తీ నివారణపై పర్యవేక్షణ ఉండాలని తదితర అంశాలపై సిబ్బందికి విధులను కేటాయిస్తూ సమీక్ష చేశారు.

## 12న మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఈ నెల 12న పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు చెప్పారు. ఉదయం 10 నుంచి 12 వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. 220 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లును పొందాలని, పరీక్షకు ఆధార్‌కార్డు తప్పనిసరి చెప్పారు.

**పాతపట్నం...**



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : స్థానిక పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్లో 2026-27 విద్యా సంవత్సరమునకు 6వ తరగతిలో అడ్మిషన్లు పొందడానికి 100 సీట్లకు 226 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికి ఏప్రిల్ 12వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ కె.వి.రత్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులు తమ కాండిడేట్ ఐడి మరియు పుట్టిన తేదీ ఆధారంగా ఆన్లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకుని ఉదయం 8.30 గంటలకు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. సందేహాలు నివృత్తి కొరకు8919820148 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

## ఐటీడీఏ ఎదుట గిరిజన సమస్యలపై ధర్నా



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : గిరిజనులు సేకరిస్తున్న జీడిపిక్కలు కిలో రెండు వందల రూపాయలుకు గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని. డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఐటిడిఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పీఎం జన్మన్ గృహాల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయాలని గిరిజన ప్రాంతాలలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారులు పూర్తి చేయాలని, జలజీవన్ పనులు పూర్తిచేసి గిరిజనులకు త్రాగునీరు అవసరాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పిఓ పవర్ స్వప్నల్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ఆదివాసి సంఘం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు ఎం.లక్ష్మణరావు, పి.సాంబయ్య, జె.శ్రీరాములు. తదితరులు పాల్గొన్నారు.

## దూడల పెంపకంలో మెలకువలు పాటించాలి



కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : పాడి పరిశ్రమలో లాభాల కోసం శాస్త్రీయ పద్ధతుల్లో దూడల పెంపకం, పోషణ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ముఖ్యమని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డి.ఎల్.డి.ఎ.) సౌజన్యంతో ఉపసంచాలకులు డాక్టర్ సి.హెచ్.సత్య ప్రకాష్ అన్నారు. ఆయన శుక్రవారం తిలారులోని పశువైద్య చికిత్సాలయంనందు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు తిలారు, తుంబయ్యపేట, రావిపాడు ఏనేటి కొత్తూరు గ్రామాల నుండి సుమారు 40 దూడలను తీసుకురావడం జరిగింది. ఇక్కడ పాల్గొన్న దూడలలో తక్కువ వయసులో ఏపుగా పెరిగిన దూడలను, జాతి బట్టి నిర్ధారించుకొని బహుమతులు అందజేశారు. శాస్త్రీయమైన పెంపకంతో దూడలు త్వరగా లైంగిక పరిపక్వం చెంది తక్కువ వయసులోనే మొదట కాన్పుకు సిద్ధమవుతాయి. తద్వారా పాడి పరిశ్రమలో లాభాలు పెరుగుతాయి. స్త్రీ లింగ నిర్ధారణ వీర్యంతో మేలు రకం ఆబోతుల వీర్యకణాలతో శాస్త్రవిజ్ఞాన పరిమళాలతో పాల వెల్లువకు శ్రీకారం చుట్టింది. ఒక లింగ నిర్ధారణ వీర్యం ఖరీదు 1800 రూపాయలు ఉండగా కేవలం 150 రూపాయలకే రైతుకి అందిస్తుంది. రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డా.ఎం.లోకనాథం, డా.ఎమ్.ప్రజ్ఞ చైతన్య, డా. ఎల్.కిరణ్ కుమార్ మరియు మండల పశువైద్యసహాయక సిబ్బంది రాంబాబు, ఫణీంద్ర, ప్రసాదరావు, భాస్కరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## 60 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



కంచిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: సోంపేట ఎక్సైజ్ సిబ్బంది మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కలిసి ఒడిశా సరిహద్దుల్లో కాపు గాసి ఒడిశా నుంచి రెండు కావుళ్ళతో నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకొని వారి వద్ద చేరో 30 లీటర్లు అనగా 60 లీటర్లు నాటు సారా స్వాధీన చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ చెప్పారు. ఒడిశా రాష్ట్రం తుంబగడకి చెందిన భాస్కర్ కార్జీ మరియు కృష్ణ సబర్‌లను అరెస్ట్ చేసి సోంపేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ఇద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించటం జరిగినది. వారి వాంగ్మూలం ద్వారా కంచిలి మండలం దొలసాయి గ్రామానికి చెందిన చైతన్య భుయ్యా మీద కూడా కేసు నమోదు చెయ్యటం అయినది. గతంలో నాటు సారా కేసులు కలిగి ఉన్న వారి అందరి మీద ప్రత్యేక నిఘా మరియు అందరి మీద బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నామని తెలిపారు. సోంపేట ఎక్సైజ్ సి.ఐ రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సి.ఐ శ్రీనివాస్ ఎస్.ఐలు సుజాత, జగన్నాథ్ సిబ్బంది విజయ్, రమణ, గాలిబ్, వెంకటేష్, ఉమాపతి మరియు మార్కారావులు పాల్గొన్నారు.

## మురుగు కాలువలు శుభ్రం చేయాలి



సంతకవిటి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : బిల్లాని పంచా యితీ ఇజ్జిపేట గ్రామంలో మురుగు సమస్యలు తీవ్రంగా మారాయి. గ్రామంలోని కాలువలు అస్తవ్యస్తంగా మారి, మురుగు తీయకపోవడంతో చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వ్యాపిస్తూ, దోమల బెడద ఎక్కువై స్థానికులు రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎగువ ద్వారబంధంలో హ్యాబిటేట్ రైట్స్‌పై అవగాహన



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: అటవీశాఖ ఐటీడీఏ రెవెన్యూ సంయుక్తంగా హ్యాబిటెడ్ రైట్స్ పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం సీతంపేట మండలంలోని ఎగువ ద్వారబంధం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ హాబిటెడ్ రైట్స్ ఇవ్వడానికి గల అర్హతలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజనులు యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హ్యాబిటెడ్ రైట్స్ పంపిణీకి అవసరమయ్యే అన్ని అంశాలపై గిరిజనులకు పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటా ప్రతినిధి గిరిరావు, గిరిజన సంక్షేమ శాఖ అటవీ శాఖ స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణమూర్తి, ఐటిడిఎ ఏపీఓ జి.చిన్నబాబు, పార్వతీపురం ఐటిడిఎ ఏపీవో మురళీధర్ అటవీశాఖ రేంజర్ రామారావు డిప్యూటీ తహసిల్దార్ శ్రీవిద్య. తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త

## రవీంద్రభారతిలో ఘనంగా కిడ్స్ కాన్వోకేషన్



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం ఘనంగా కిడ్స్ కాన్వోకేషన్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డా. భారతి కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దే దిశగా ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయడం ద్వారా చిన్నారుల్లోని ఆత్మవిశ్వాసం పెరిగి వారికి మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తి సామర్థ్యాలు వెలికి తీయడానికి తోడ్పడే విధంగా ఈ విద్యా విధానం అమలు చేయడం ద్వారా వారి భావి జీవితానికి మెరుగులు దిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నార్త్ ఆంధ్రా జోనల్ ఇంచార్జ్ వెంకటేష్, సీ జీ యం.వసంత, జీ యం కె.రమ్య, చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో చిన్నారులు చేసిన పలు నృత్యాలు అందరినీ అలరించాయి.

## నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది నవధాన్య విత్తన కిట్స్‌ను తయారు చేశారు. సందర్భంగా డిపిఎం పూజారి సత్యనారాయణ మాట్లాడుతూ నోడల్ బి.ఆర్.సి సెంటర్‌లో రెండు వేల విత్తన కిట్స్ ను తయారు చేశామన్నారు. రైతులతో నవధాన్య విత్తన సాగుకు అవసరమైన విత్తనాలను ప్రస్తుత సిబ్బంది అందరూ కూడా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సరైన ప్రణాళికలు చేసుకొని విత్తన కిట్స్‌ను రైతులందరికీ పంపిణీ చేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ డిపియం ధనుంజయరావు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలి



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఇటీవల వరుసగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై మరియు అన్నమయ్య జిల్లా పీలేరులో న్యాయవాదిని హత్య చేయడం అత్యంత దారుణమని పాతపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకుగాను చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. న్యా యవాదులు వృత్తి ధర్మం నిర్వర్తించినందుకు భౌతిక దాడులు చేయడం, అలాగే హత్య చేయడమన్నది అత్యంత హేయమైన చర్య అని తెలియజేస్తూ శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులపై జరుగుతున్న వరుస సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకుగాను తక్షణమే పటిష్టమైన న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉర్లాన దాలయ్య, జనరల్ సెక్రెటరీ మద్దిల రమణ, ఉపాధ్యక్షులు గొంటి రామ్మోహన్ రావు, ఏజీపి బుద్దల ఈశ్వర సత్యనారాయణ, న్యాయవాదులు మెట్ట రామారావు, గేదెల సూర్యారావు, పి.ఈశ్వర సత్యన్నారాయణ పట్నాయక్, సంపతిరావు రవికుమార్, లుకలాపు యుగంధరరావు, గంగు సుం దరరావు, పద్ద అప్పలనాయుడు, చెంచల రామకృష్ణ, సిష్టు షణ్ముఖరావు, ముక్త అప్పలరాజు, శ్రీహరి, బాడాన వెంకటప్పల నాయుడు, కూర్మాపు రామారావు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జనగణన యాప్‌ను అనుసరించి విధులు నిర్వహించండి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : గ్రామాల్లో జనగణన యాప్ ను అనుసరించి విధులు నిర్వహించాలని సంబంధిత ట్రైనీలు సూర్యనారాయణ, మల్లేశ్వరరావులు అన్నారు. రెండవ రోజైన శుక్రవారం 40 మంది సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు ఈ జనగణన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాప్‌లో పొందుపరిచిన 34 అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి జనగణన నమోదు పత్రాలలో పూరించాలన్నారు. యాప్‌ను ఎలా డౌన్లోడ్ చేయాలి, దానిని ఎలా నిర్వహించాలి, అనుసరించవలసిన విషయాలను ఈ శిక్షణ ద్వారా తెలియజేశారు. శిక్షణ సమయంలో వీరికి ఆహార, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆయనతో ఏ.ఎస్.ఓ ఏ.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల లక్ష్యాలు పూర్తిచేయనివారిపై చర్యలు



సీతంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనుల్లో సిబ్బంది లక్ష్యాలు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని మన్యం జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు మండలంలో 40 కోట్ల రూపాయలు మేర ఉపాధి హామీ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పనులు సక్రంగా జరిగాయా లేదా అనే దానిపై ప్రజావేదిక నిర్వహించడం జరిగిందన్నారు. వేతనదారులకు పనులు కల్పించే బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉందన్నారు. అలా ఏ సిబ్బంది అయినా కల్పించకపోతే చర్యలు కట్టిన తరంగా ఉంటాయి అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్ ఎంపీడీవో బీబీ మిశ్రా. ఏపీ డి.త్రివిక్రమరావు అంబుడ్స్ మాన్ ఎన్ తిరుపతిరావు. కే మాధవరావు. ఈసీ పాండురంగనాథం, ఏపీవో సాగర్ , తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ బీజేపీ బీఎల్ఏ 1 గా త్రివేణి



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ పాతపట్నం నియోజకవర్గ బీఎల్ఏ1గా సిరిపురం త్రివేణి నియమితులయ్యారు. విశాఖపట్నంలో నిర్వహించిన సమగ్ర ఓటరు సవరణ -2026 శిక్షణా కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సూచన మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఈ నియామకాన్ని ఖరారు చేసారు. ఈ సందర్భంగా శిక్షణా వేదికపై మాధవ్ నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు తేజేశ్వరరావుకు అందజేశారు. రానున్న ఓటరు సవరణ ప్రక్రియలో నియోజకవర్గ స్థాయిలో ఓటర్ల జాబితా క్రమబద్ధీకరణ, కొత్త ఓటర్ల నమోదు వంటి కీలక అంశాల్లో త్రివేణి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. పార్టీ బలోపేతానికి, పారదర్శకమైన ఓటరు నమోదుకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమ్మవారి గుడి కాలనీలో సీసీ రోడ్డు పనులు



పాతపట్నం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవతో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. శుక్రవారం స్థానిక అమ్మవారి గుడి కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్, టిడిపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే గోవిందరావు ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజల కనీస అవసరాలైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు అక్కంధ్ర సన్యాసి, ఆర్.చలపతి, నట్టు స్వామి, శాసనపురి వెంకటరమణ, డోల కుమార్, నక్క మార్కండేయులు, గోరుశెట్టి దుర్గారావు, తాడేల సుధాకర్, లోకేష్, నెయ్యల వెంకీ, త్రినాధరావు, టంకాల సోమేశ్, పి.మోహనరావు, తార విజయ్ కుమార్, చంటి, బుజ్జి, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా శామ్యూల్ హనీమూన్ జయంతి



కవిటి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : హోమియోపతి వైద్య పితామహుడు క్రిస్టియన్ ఫెడ్రిక్ శామ్యూల్ హనీమూన్ 271 జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగతి శివాలయం ఆవరణలో నిర్మించిన శామ్యూల్ హనీమూన్ విగ్రహానికి సోంపేట ఎంపీపీ నిమ్మాన దాసు, జగతి హోమియో డాక్టర్ దుర్గాప్రసాద్ పట్నాయక్‌తో పాటు తాజా మాజీ సర్పంచ్ పూడి వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు జై ప్రకాష్ గ్రామ పెద్దలు భావన సీతారామమూర్తి పూడి వెంకటేశం భావన నారాయణమూర్తి, ప్రియ జోగయ్య భావన చంద్రశేఖర్ భావన కామేశ్వరరావు సమల ధనుంజయ పూడి వెంకటరమణ గుడియా సంతోష్ లమ్మత ప్రభాకర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

11vzm15:11vzm15.qxd 11-04-2026 01:16 Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## భూసారం తగ్గిపోవడం వల్లే పంట దిగుబడి తగ్గుదల

గరుగుబిల్లి , ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలం తోటపల్లిలో గల అన్నపూర్ణేశ్వరి శిక్షణాలయంలో ఖరీఫ్ 2026 సన్నద్ధత, ఎల్ నినో ముందస్తు జాగ్రత్తలు మరియు సీడ్ టు సీడ్ ప్రకృతి వ్యవసాయ వ్యూహాలపై జరుగుతున్న 3 రోజుల శిక్షణలో పాల్గొన్న నైరా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జోగి నాయుడు పాల్గొని కొన్ని ముఖ్య సూచనలు చేసారు. రెండు బృందాలుగా జరుగుతున్న సుమారు 120 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధిక దిగుబడుల ఆశతో ఏడాదికేడాది రసాయన ఎరువులు, పురుగుమందులు, కలుపు మందులు పరిమాణం పెంచుతూ పోవడం వలన నేలలో సారం తగ్గుతోందని ఫలితంగా దిగుబడులు తగ్గిపోయి వ్యయం పెరుగుతోందని ఈ అంశాన్ని రైతు సోదరులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో శ్వీళీళీ కన్సల్టెంట్లు వ్రాసు దేవరావు , శ్రీమతి ఉమామహేశ్వరి , శ్రీమతి విరాజిత, సన్యాసి రావు , ఎం.టి.ఎల్ గణేష్ చంద్ర, ఎన్.ఎఫ్. ఏలు అన్నపూర్ణ, ముసలయ్య, శారద, జట్టు ట్రస్టు సిబ్బంది, ఏపీ సి ఎన్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కే.కృష్ణాపురంలో పోషణ పక్వాడా కార్యక్రమం



దత్తిరాజేరు ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మండలంలోని కే కృష్ణాపురం ఎం. లింగాలవలసలో తాత్కాలిక సూపర్వైజర్లు ఇందిరా భవాని అపర్ణ రాణి అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలకు బాలింతలు చిన్నారులకు పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పోషణ పక్వాడ కార్యక్రమాలను అన్ని అంగన్వాడి కేంద్రాల్లో జరిపించాల న్నారు మొదటి ఆరు సంవత్సరాల్లో లోపు పిల్లలకు మెదడు అభివృద్ధిని గరిష్ట స్థాయికి చేర్చడం అనేది ముఖ్య ఉద్దేశమన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా పుడతారన్నారు పోషకాహార లోపం నివారణ పై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా గర్భిణీ తీసుకోవాల్సిన ఆహారం ఆరోగ్యం రక్తహీనత గురించి 1000 రోజులు సంరక్షణ తల్లి బిడ్డ ఆరోగ్యం నవజాతి శిశువు సంరక్షణ పరిశుభ్రతల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు విజయలక్ష్మి ఏఎన్ఎంలు హెల్పర్లు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## పిల్లలకు పోషకాహారంలో జాగ్రత్తలు పాటించాలి



శృంగవరపుకోట,ఏప్రిల్10, ప్రభాతవార్త : పిల్లలకు అందించే పోషకాహారంలో తగు జాగ్రత్తలు పాటించాలని అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం తెలిపారు. శుక్రవారం మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ మెట్టపాలెం గిరిజన గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషక పక్వాడ పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పోషకాహార విలువలు తీసుకోవలసిన జాగ్రత్తలుపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్ర కార్యకర్తలు, సిబ్బంది, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## జీవనోపాధులకు ఆర్థిక రుణాలపై శిక్షణ



నెల్లిమర్ల, ఏప్రిల్ 10,ప్రభాతవార్త : మండలంలోని రామతీర్థం సచివాలయంలో కల్కి పద్మావతి క్లస్టర్ విఓ ఓబీ, విఓ ఏ, ఈ నారిలకు ఏసి ఎల్ పి పై ఏపిఎం సురేష్ పర్యవేక్షణలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. 202627 సంవత్సరానికి గాను సభ్యులకు అవసరమైన జీవనోపాదులకు కావలసిన అప్పు వారికీ అవసరమయిన నెలలో పొందుటకు, వారికి కుటుంబ అవసరాలకి కావాల్సిన మొత్తం ఏ నెలలో కావలసింది? ఎంత మొత్తం కావాలి? అనే వివరాలు ఏ సి ఎల్ పి యాప్ లో ఏ విధముగా చేయాలన్న వివరాలు కోసం సభ్యులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఆర్థిక అవసరాలకు రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లింపులు అవకాశాలు గురించి తెలుసుకున్నారు. శిక్షణ కార్యక్రమానికి ఎల్పి నర్సింగరావు, ఏ. సూరీడమ్మ , ఎస్. అప్పలనాయుడు , ఎస్. శ్రీను వాసరావు ఈ నారి లు, వివిధ గ్రామాలకు చెందిన వివో లు ఓబిలు ,స్థానిక వివోఏ మనోజ హాజరయ్యారు.

## సర్వసిద్ధి రమణ మాస్టర్ విగ్రహావిష్కరణ



బొబ్బిలి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గొల్లపల్లి గ్రామానికి చెందిన సర్వసిద్ధి రమణ మాస్టర్ విగ్రహావిష్కరణ ఎమ్మెల్యే ఆర్విఎస్ కే రంగారావు చేతుల మీదగా ఘనంగా గొల్లపల్లి గ్రామంలో నిర్వహిం చారు. శుక్రవారం గొల్లపల్లి గ్రామంలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వి ఎస్కే రంగారావు ,(బేబీ నాయన) ఆధ్వర్యంలో వార్డు మాజీ కౌన్సిలర్ కాకల వెంకట్రావు. గోవిందమ్మ టిడిపి పార్టీ ఇంచార్జ్ నాయుడు. బొబ్బది తవిటి నాయుడు పిరిడి ఈశ్వరరావు. సర్వసిద్ధి సూర్యనారాయణ ఆధ్వర్యంలో బేబీ నాయన ఆర్థిక సహాయంతో వార్డు కేంద్రములో సమాజ సేవకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వసిద్ధి రమణ మాస్టర్ అశువుల బాసి ఐదు సంవత్సరాలు అయినా తన సేవలను గుర్తించి కాకల వెంకట్రావు బేబీ నాయన సౌజన్యంతో కూడలిలో తన విగ్రహాన్ని ప్రతిష్టించడం ఎంతో ఉన్నతమైన భావమని పలువురు ప్రశంసిస్తున్నారు. సందర్భంగా బేబీ నాయన మాట్లాడుతూ రమణ మాస్టారు పేద ప్రజల అభ్యున్నతికి బడుగు బలహీన వర్గాల ఉన్నతిని సాధించాలనే ప్రతి నిత్యము జీవితం ఉన్నంతవరకు పాటుపడాలని ఆయనను గ్రామస్తులు మరువు రాణి వ్యక్తిగా తన విగ్రహాన్ని ప్రతిష్టించుకోవడం మన సాంప్రదాయంగా భావించారన్నారు. బొబ్బిలిలో ఎన్నో కుటుంబాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వీణలు తయారీ కార్మికులు ఉన్నారని వారికి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉండాలంటే ఇక్కడ వీణ నిర్మిత కేంద్రం తయారు చేయాలని అప్పటి ప్రభుత్వాలను పోరి మన జిల్లాలో పనిచేసిన కలెక్టర్ నాగిరెడ్డి చేతుల మీదుగా మీనా కేంద్రాన్ని క్రాఫ్ట్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో ఆయన కృషి ఎనలేనిదని గ్రామస్తులు అంటున్నారు. ఆయన కృషి ఫలితమే మా కుటుంబాలు వీణ కేంద్రంలో బ్రతుకుతున్నామని అన్నారు. అందుకు బొబ్బిలి రాజులు సహకారం ఎప్పుడూ ఉంటుందని బేబీ నాయన వారికి అభయమిచ్చారు. రమణ మాస్టర్ కుటుంబ సభ్యులతో పాటు గొల్లపల్లి గ్రామంలో ఎస్సీ వీధికి సంబంధించి అనేక కుటుంబాలు ఈ కార్యక్రమానికి హాజరవ్వడం చాలా సంతోషంగా ఉందని బేబీ నాయన కొనియాడారు. ఆయనతో అనుబంధం ఉన్న రాజకీయ నాయకులు కార్మికులు కార్మిక అధ్యక్షులు కుల మతాలకు అతీతంగా జిల్లా స్థాయిలో ఆయన విగ్రహారానికి విచ్చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు : మంత్రి

సాలూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : రాష్ట్ర పేదప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)



ఎంతో భరోసాను కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా టౌన్, రూరల్ కు సంబంధించిన అనారోగ్య సమస్యలతో భాదపడుతున్న లబ్ధిదారులకు సీఎం సహానిధి ద్వారా సుమారు 9లక్షల 87వేల 512 రూపాయల చెక్కులను సంధ్యారాణి చేతులు మీదుగా అందజేశారు. అనంతరం మాట్లాడుతు పేదల కష్టకాలంలో ధైర్యాన్నిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోవడం కూటమి ప్రభుత్వం భాద్యతని మంత్రి క్లారిటీ ఇచ్చారు. అలాగే చిక్కులు అందుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు అలాగే రాష్ట్ర మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది. చిట్టి, హర్షవర్ధన్, కిలారి. రవి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించని వాహనదారులకు ఎస్ఐ క్లాస్



నెల్లిమర్ల, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్క వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని నడపాలని నెల్లిమర్ల ఎస్సై బి. గణేష్ తెలిపారు. శుక్రవారం వెహికల్ చెకింగ్ నిర్వహించి హెల్మెట్ ధరించని వారికి ప్రత్యేకంగా క్లాస్ నిర్వహించి హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలు, గతంలో హెల్మెట్ ధరించకపోవడం కలిగే అనర్థాలు వివరించారు. అలాగే హెల్మెట్ ధరించకపోతే పోలీసులు 1035 ఫైన్ విధించడం జరుగుతుందని దానికి బదులుగా మంచి హెల్మెట్ కొనుక్కొని ధరించడం వల్ల తమ ప్రాణాలని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. హెల్మెట్ కొనే సమయంలో మంచి నాణ్యతతో కూడిన ఐ ఎస్ ఐ మార్క్ ఉన్న హెల్మెట్లను కొనుక్కొని ధరించాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, దీనివల్ల తల్లిదండ్రులు కూడా కేసుల్లో ఇరుక్కుంటారని ఆయన హెచ్చరించారు.

## ఫేకర్ కాలనీలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



గరివిడి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: గరివిడి ఫేకర్ జె టైప్ కాలనీ లో గత కొంతకాలంగా విద్యుత్తు సర్వీసు వైర్లు వేలాడుతున్నా సంబంధిత శాఖ అధికారు లు పట్టించుకోవడం లేదు. నిత్యం ప్రమా దమని తెలిసినా అదే వైర్లు కింద నుండి రాకపోకలు సాగిస్తూ కాలనీ వాసులు జీవనాన్ని సాగిస్తూ ఉన్నారు. ప్రమాదం అంచున వారు బితుకు బితుకు మంటూ బతుకు తున్నారు. అధికారులకి తమ గోడు వెళ్లగక్కుకున్నా, పాలకులకు తమ వేదన చెప్పుకున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. అదిగో, ఇదిగో అంటూ అధికారులు, పాలకులు కాలయాపన చేస్తున్నారని జె టైప్ కాలనీ వాసులు మొర్రో అంటున్నా రు. విద్యుత్తు తీగలు వలన ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో నని ఆ కాలనీ వాసులు కంటిమీద కునుకు లేకుండా నివసించే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. విద్యుత్ సర్వీసు వైర్లు వేలాడే ప్రాంతంలో కొత్తగా విద్యుత్తు స్థంభం నెలకొల్పి తీగలు ఎత్తు పెంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



గరివిడి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండలం లోని వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులకు శ్రీరామ్ నగర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. మండలం లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లకు చెందిన మూడు వేల మంది విద్యార్థులకు ఉచితం గా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. నేత్ర పరీక్షలు నిర్వహించిన విద్యార్థుల్లో 90 మంది విద్యార్థులకు కళ్ళద్దాలు అవసరమైన దృష్ట్యా వారికి లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీరాం నగర్ అధ్యక్షులు బలిజేపల్లి రవి, ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి ప్రసన్న కుమార్, ప్రతినిధులు మూర్తి తదితరులు కళ్ళద్దాలు అందించి విద్యార్థుల్లో ఆనందం నింపారు. శ్రీరాం నగర్ లయన్స్ క్లబ్ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 12న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

భోగాపురం ఏప్రిల్ 10 ప్రభాతవార్త : భోగాపురం ఆదర్శ పాఠశాలలో ఆదివరం ఉదయం 10:00 గంటల నుండి 12:00 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఉదయం 9:00 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి హాల్ టికెట్ తప్పనిసరి. విద్యార్థులందరికీ పరీక్షలో విజయాన్ని ఆకాంక్షిస్తూ.. ఏప్రిల్ 10న నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల వివరాలు, ప్రవేశ పరీక్షకు సంబంధించిన సూచనలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మోడల్ పేపర్లు మరియు వీలీళి ప్రాక్టీస్ షీట్లు పంపిణీ చేయబడినవి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన , ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రి టీజీ భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే బోనెల



పార్వతిపురం, ఏప్రిల్ 10, ప్రభాత వార్త: రాష్ట్ర ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్తాను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వ కంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చేనెల పార్వ తీపురం మన్యం జిల్లా కేంద్రానికి హాజరు కావాలని మంత్రిని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాటి ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరుకావాలని మంత్రి ని కోరడం జరిగిందన్నారు. పార్వతీపురంలో ఇండస్ట్రీస్ గురించి ప్రయత్నాలు చేస్తున్నామని, దీనికి సహకరించాలని మంత్రి ని కోరడం జరిగిందన్నారు. దీనికి ఆయన స్పందిస్తూ ఎంఎస్ఎంఈ పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు తొందర్లోనే ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చారని, వాటి ప్రారంభోత్సవానికి కూడా హాజరు అవుతానని చెప్పడం జరిగిందన్నారు.

## కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ తహశీల్దార్ విచారణ



వేపాడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : విజయనగరం గ్రీవెన్స్‌లో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ నుండి వచ్చిన ఆదేశాలపై శుక్రవారం డిప్యూటీ తహసిల్దార్ పి రామకృష్ణ విచారణ జరిపి మూడు గ్రామాల రైతుల నుండి వివరాలు సేకరించారు. మండలంలోని గుడివాడ రెవిన్యూలో సర్వేనెంబర్ 175/1,2,3,4,5 లలో గల సుమారు 15 ఎకరాల సాగు భూమికి సంబంధించి సాగులో ఉన్న రైతులు తమకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గుడివాడ గ్రామంలో రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి మా సాగులోనే భూమి ఉందని ఆ భూమిని మా పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు చేయాలని,15 మంది రైతులు విజ్ఞప్తి చేశారు. అలాగే అదే భూములో సాగులో ఉంటున్న మరో ఇద్దరు రైతులు ఆ భూమిని మేము అమ్మేశామని ఆ భూమిపై పట్టాదార్ పాస్ పుస్తకాలు కొరకు మ్యుటేషన్ పెట్టుకున్న నవుడూరి సత్య వెంకటరమణమూర్తి పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని చెప్పగా వారి వాంగ్మూలం అధికారులు తీసుకున్నారు. పై విషయాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామని ఉప తహసిల్దార్ పి.రామకృష్ణ తెలిపారు. కాగా ఈ విషయంపై తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం సరికాదని గ్రామంలో రైతులు మధ్య కాసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. గ్రామ పెద్దలు కలుగజేసుకుని ఫిర్యాదు పై వచ్చిన అధికారులు విచారణలో ఎటువంటి అల్లర్లకు పాల్పడకూడదని సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. రెవెన్యూ అధికారులతో పాటు రైతులు వంటాకు శ్రీను, బూసరి సింహాచలం నాయుడు, బూసరి అప్పల నాయుడు, ఆర్. ముత్యాల నాయుడు , వంటాకు వెంకటరమణ, వంటాకు గోవింద , జక్కాన దేముడు, గ్రామ పెద్దలు సిరికి సూర్యనారాయణ, జగన్నాధం, కృష్ణంనాయుడు, బూసరి కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి



బలిజిపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : అరసాడ గ్రామంలో గురువారం రాత్రి ట్రాన్స్ఫార్మర్తుకు గురవడంతో యధా స్థానంలో కొత్త 63 కెవి ట్రాన్స్ఫార్మర్ తెచ్చి బిగించి యధావిధిగా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధించిన విద్యుత్తు సిబ్బంది విద్యుత్ సింహాచలం లైన్ మాన్ సతీష్ కోట్ల బుజ్జి ధనంజయ తదితరులు సహకారంతో పునరుదించడం జరిగింది దీనికి అరసాడ గ్రామ ప్రజలు విద్యుత్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న డిపో రైస్ స్వాధీనం ... ఆటో సీజ్



సాలూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : సాలూరు మండలం దండిగం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న డిపోరైస్(పీడీఎస్) జిల్లాపౌర సరఫరాల అధికారి బి.అశోక్ ఇంకా డిప్యూటీ తాసిల్దార్ షేక్ ఇబ్రహీం స్వాధీనం చేసు కున్నారు. శుక్రవారం వారు తెలియ జేసిన వివరాలు ఇలాఉన్నాయి. దండిగం నుండి ఒరిస్సా రాష్ట్రానికి ఎపి35 టిబి 0759 నెంబర్ ఆటోలో వెయ్య కిలోలు డిపోబియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నమన్నారు. అలాగే ఆటోను సీజ్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్ కు అప్పగించామని తెలిపారు. అంతేకాకుండా డిపోరైస్ తరలిస్తున్న సీదరపు. దాలయ్య, మువ్వల. నారాయణ పై జిల్లా సబ్ కలెక్టర్ కోర్టులో 6ఏ కేసు నమోదు చేసామని క్లారిటీ ఇచ్చారు. అజయ్, హరిప్రసాద్, తేజోరామ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో తప్పిన పెను ప్రమాదం



మక్కువ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మండల కేంద్రంలో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. విస్తరణలో భాగంగా రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణాలను శుక్రవారం సాయంత్రం ప్రోక్లనర్ సహాయంతో తొలగిస్తున్న సమయంలో దుకాణం పిల్లర్ విరిగి విద్యుత్ స్తంభాల పై ఉన్న ఫైబర్ నెట్ వైర్లపై పడడంతో చివరగా ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడింది. విద్యుత్ స్తంభం దగ్గర ఉన్న సిహెచ్ రామకృష్ణ వాహనంపై విద్యుత్ స్తంభం విరిగిపడడంతో వాహనం మొత్తం ధ్వంసం అయింది. అయితే విద్యుత్ స్తంభం విరిగి పడేటప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే అప్పుడే వాహనం దగ్గర ఉన్న వ్యక్తులు దూరం జరగడంతో ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. హఠాత్తుగా ప్రమాదం జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురి అయ్యారు.

## 8వ పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన



తెర్లాం, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) : 8 వ పోషణ పక్వాడా కార్యక్రమం పైన గర్భిణీలకు బాలింతలకు అవగా హన కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారిని కేవీ బాలమణి పాల్గొన్నారు . శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా జిల్లా శిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారిని కేవీ బాలమణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులు ఆరోగ్యం పైన తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారం పై ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ దృష్టి సారించాలని పోషక విలువలు కలిగిన పదార్థాలు సేవించాలని గర్భంలో పెరుగుతున్న శిశువుకు బలమైన ఆహార అందించే దిశగా గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలు మీకు అందుబాటులో ఉన్నాయని తద్వారా కేంద్రాల నుంచి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెరుమాలి తె ర్లాం సెక్టార్ అంగన్వాడి సూపర్వైజర్ అపర్ణ ఈశ్వరమ్మ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కౌన్సిలర్ అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అధికారులు



కొమరాడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలంలో నాగావళి నది తీర ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసినట్లు కొమరాడ తహసిల్దార్ రత్నకుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కొమరాడ రెవెన్యూ సిబ్బంది పోలీసులు సంయుక్తంగా చేపట్టిన దాడులలో నాగావళి నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకోవడం జరిగిందన్నారు.

## మామిడిపల్లిలో డ్రై డేపై అవగాహన : తహశీల్దార్

సాలూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మామిడిపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించామని తాసిల్దార్ ఎం సురేష్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాలు ప్రకారం అక్కడ గ్రామ ప్రజలకు డ్రైడే గురించి అవగాహన కల్పించామన్నారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశామన్నారు. అంతేకాకుండా పారిశుధ్య కార్మికులతో దోమల నివారణకు కాలువలలో మందు పిచికారి దగ్గరుండి చేయించారు. అలాగే నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టామని ఎమ్మార్వో క్లారిటీ ఇచ్చారు. సచివాలయ, అంగన్వాడి, ఆశాలు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు మత్తుపదార్థాలు పై అవగాహన..ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్. కురుపాం ఏప్రిల్ 10 ప్రభాతవార్త. మత్తు పదార్థాలు వినియోగిస్తే వచ్చే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కురుపాం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు . శుక్రవారం నవోదయమ్ కార్యక్రమం లో భాగంగా కురుపాం మండల కేంద్రంలో ఉన్న బాలురు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో మత్తు పదార్థాలు సేవించడం వలన సంభవించే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహచర విద్యార్థులు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి అలవాట్లకు లోనైతే తమకు తెలియజేయజేస్తే వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, విద్యార్థులు అందరూ వారి నైపుణ్యాలను నిరంతరం మెరుగు పరుచుకుం టూ లక్ష్యాలను సాధించి మంచి పౌరుడిగా ఎదిగి సమాజ అభివృద్ధికి తమవంతు ప్రయత్నం చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ ఇనస్పెక్టర్ రాజ శేఖర్, సిబ్బంది హాజరయ్యారు.

## టీడీపీకి కార్యకర్తలే పునాది : ఎమ్మెల్యే కోళ్ల



లక్కవరపుకోట, ఏప్రిల్ 10, ప్రభాత వార్త : టీడీపీకి రాష్ట్రములో అలాగే నియోజకవ ర్గంలో వున్నా కార్యకర్తలే గట్టి పునాధులు అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు శుక్రవారం ఎల్. కోటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యక ర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలోనూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ కార్యకర్తలు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై ఈ సమా వేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడతామని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష

వేపాడ, ఏప్రిల్ 10 , ప్రభాతవార్త: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఈ నెల 12వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్ ఈశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ పరీక్షను ఆదివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్లో హాల్ టికెట్లు పొందలేని వారు శనివారం పాఠశాలకు వచ్చి హాల్‌టికెట్లు పొందవచ్చని కోరారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 12వ తేదీ ఉదయం 8:30 గంటలకు ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో హాజరు కావలసి ఉంటుందని సూచించారు.


ఆర్.ఓ.సి.నెం.70/2023-ఎ1, తే.10.04.2026 ది నగర పంచాయితీ కార్యాలయం నెల్లిమర్ల.

**బహిరంగ వేలం నోటీసు**

నెల్లిమర్ల నగర పంచాయితీకి సంబంధించి 2026-27 సంవత్సరమునకు గాను రోజువారి రోడ్డు మార్జిన్ మరియు మార్కెట్ ఆశీలు వసూలు చేసుకునే హక్కును లీజుకు ఇచ్చుటకు తే.13.04.2026దీన సోమవారం నాడు నగర పంచాయితీ కార్యాలయం నందు ఉదయం 11.30 గంటకు కమీషనరు వారిచే గాని అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలం పాట నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొను దలచిన వారు నిర్ణీత ధరావత్తు సైకం చెల్లించి తే.13.04.2026 కి ముందు పొందినటువంటి రూ.1,00,000/-ల విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు ఇ.సి.లతో 2026-27 సంవత్సరము వేలం నోటిఫికేషన్ నందలి షరతులకు లోబడి పాటలో పాల్గొనవలెను. ఇది వరకు గుత్తలు సక్రమముగా చెల్లించని వారు మరియు వారి కుటుంబసభ్యులు వేలం పాట నందు పాల్గొనుటకు అనర్హులు. మిగిలిన వివరములు పొందగోరు వారు ఈ కార్యాలయం పనిచేయు వేళలో ఎ1 గుమాస్తా వారి నుండి పొందగలరు మరియు సదరు పాట దక్కించుకున్న పాటదారు సబ్ రిజిస్ట్రార్, నెల్లిమర్ల వారి కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ చేయించి సంబంధిత కాపీలు ఈ కార్యాలయమునకు దాఖలు చేయవలెను.

| క్ర. నెం. | గుత్త వివరములు | కాల పరిమితి | ధరావత్తు | సాల్వెన్సీ విలువ | అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ కొరకు స్టాంప్ డ్యూటీ నిమిత్తం డిపాజిట్ | పాడిన పాటపై జి.ఎస్.టి % |
|---|---|---|---|---|---|---|
| 1 | రోజువారి రోడ్డు మార్జిన్ మరియు మార్కెట్ ఆశీలు వసూలు చేసుకొనుటకు | తే. 01.04. 2026 ది నుండి తే.31.03. 2027 ది వరకు | రూ. 50,000/-లు | రూ. 1,00,000/-లు | రూ. 6,000/-లు | 18% |

కమీషనరు, నెల్లిమర్ల నగర పంచాయితీ

